ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

జులై 5, 2009

392-86

హ్యాపీ బర్త్‌డే

(2009 జులై 5 నుంచి
2009 జులై 11 వరకు)

కె. స్వాతి
6సం॥, జులై-8
వేణు-రామకృష్ణ
ధవళేశ్వరం-రాజమండ్రి



అనన్య
1సం॥, జులై-6
లక్ష్మి-అరవింద్
తిరుపతి

యం. హర్షిత(అమ్ములు)
4సం॥, జులై-7
దేవమణెమ్మ-దేవసహాయం
కౌతాళం-కర్నూలు

బి. దివ్యశ్రీ
2సం॥, జులై-2007
అరుణ-మధు
కొల్‌కొండ-వరంగల్

షేక్ బాబా ఫక్రుద్దీన్ (షహీద్)
3సం॥జులై-5
షేక్‌కరీమున్ని- మహబూబ్‌బాషా
గిద్దలూరు-ప్రకాశం

బాలమణి
జులై-7
రత్నమ్మ-మహేందర్
ముసారంబాగ్-హైదరాబాద్

జి. ధరణి
5సం॥, జులై-8
కుమారి-నాగేశ్వరరావు
ఆటోనగర్-గాజువాక

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి
ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020

మనలో మాట

నీరు పైకమడుగు..!



నీరు పల్లమెరుగు అన్నది నిన్నటిదాకా మనమెరిగిన సామెత.

ఇకపై అది చెల్లదు. ఎందుకంటే- నీరు పల్లానికే కాదు; పైకీ ఎక్కుతుంది. మెట్టకే కాదు, ఏ పట్టణానికైనా, పల్లెకైనా విచ్చేస్తుంది. ప్రతి ఇంటికీ, నట్టింటికీ ప్రవహిస్తుంది. కాకపోతే- చుక్కచుక్కకూ లెక్క కట్టాలి. గ్లాసుగ్లాసుకూ కాసులు కొలవాలి. ఈ సురక్షిత నీటి పథకం కోసం జనం లక్షలతో సన్నద్ధం కావాలి!

'డబ్బు కట్టు - నీరు పట్టు' పథకం ఇప్పటికే బస్సు కాంప్లెక్సుల్లోనూ, షాపుల్లోనూ అమలవుతోంది. పల్లెటూళ్లో ఓ రైతు పది రూపాయలకు లీటరు పాలు అమ్ముతాడు. పట్నమెళ్లే దారిలో అతడి కొడుకు లీటరు మంచినీళ్లకు పద్నాలుగు రూపాయలు వెచ్చిస్తాడు. అలా మంచినీళ్లలా మన చేత డబ్బు ఖర్చు పెట్టించి, బహుళజాతి సంస్థలు కోట్లు సంపాదిస్తున్నాయి. దారినపోయేవాళ్లు దాహార్తి చల్లార్చుకోవడానికే ఇంత వెచ్చిస్తుంటే... ఇంటింటా ఇదే 'పథకం' అమలైతే... ఇంకెంత ఖర్చు పెట్టాలో..! ఇప్పుడు ఈ ఆలోచనే రాష్ట్రాధిపతులకు వచ్చినట్టుంది.

సురక్షిత నీరు కాదు కదా, మామూలు నీరే దొరకని గ్రామాలూ కాలనీలూ రాష్ట్రంలో కోకొల్లలుగా ఉన్నాయి. 'తాగునీరో... రాజశేఖరా' అని గొంతెండిపోయేలా అరుస్తున్నాయి. ప్రభుత్వం బాధ్యతగా కాసిని మంచినీళ్లు ఇవ్వాల్సిందిపోయి, కొలిచి కొనిపించాలని ఆలోచిస్తోంది. 'చైరు ఎక్కినవాడు నీరు పోయడా' అన్న ఆశ ఇంక నీరుకారిపోయినట్టే! ఇప్పుడు మంచినీటికి రేటేమిటని ప్రశ్నించడం కూడా అపరాధం కింద లెక్క. ఫ్రీగా ఇస్తే జనం ఫినాయిలైనా తాగేస్తారన్న తరహాలో ప్రభుత్వంలోని పెద్దలు పరాచికాలు మొదలెట్టారు. మినరల్ వాటరు ఉచితంగా ఇస్తే- జనం తాగడం మానేసి స్నానాలు చేస్తారట! గేదెలు కడుగుతారట! ఏమిటో ఈ మాటల్లోని సౌ'శీల్యం'? ఏరు దాటకముందు ఉన్న మన్నన తరువాత ఉండదు కదా!

పంచభూతాలైన భూమి, ఆకాశం, గాలీ, నీరూ, నిప్పూ...
జనం ఆధారభూతాలు.
వాటినీ సరుకులుగా మార్చేస్తున్నారు,
జనంతో చెలగాటం ఏలినోళ్లకు తప్పదు గుణపాఠం.

★

ఈ సంచికలో....

టపా	...	2
ఆరోగ్యం	...	3
తెలుసుకుందామా	...	5
జోక్స్	...	7
సీరియల్	...	8
కవిత్వమ్	...	10
తమాషాగా	...	11
బాల నేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
క్రైమ్ కథ	...	17
తెల్సా	...	22
రుచి	...	23
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

'అమ్మ' ఇచ్చిన స్ఫూర్తితోనే...

విజ్ఞాన వీచిక ... 6

పనికొచ్చే సూక్ష్మజీవులు

కథ ... 18

షేర్ షాక్

సమ్‌థింగ్ స్పెషల్... 20

చిటపట చినుకుల్లో మొక్కజొన్న తింటుంటే...



ఎందరికో స్ఫూర్తినిచ్చిన పుస్తకం

హోవార్డ్ ఫాస్ట్ రచించిన ఫ్రీడం రోడ్ (స్వేచ్ఛాపథం) చదివి చాలామంది ఉద్యమస్ఫూర్తిని పొందారు. అనేక మంది కార్యోన్ముఖులయ్యారు. వర్గపోరాటమే సామాజిక పురోగమనానికి చోదక శక్తి అన్న కారల్ మార్క్స్ నిర్వచనం, సిద్ధాంతం అజేయమైనది. శాస్త్రీయమైనది. నల్ల జాతివారు బానిసలుగా పడ్డ కష్టాలు, జాత్యహంకార దాడులు మొదలగునవి నవలలో ఉన్న అంశాలు. రచయిత వెంకట్రావు గారు స్ఫూర్తి అంశం ద్వారా తెలియజేసినందుకు ధన్యవాదాలు. మనలో మాట 'మృగాళ్లు' ద్వారా అనేక అంశాలు తెలియజేశారు. ఇటువంటి ఆటవిక చర్యలను అరికట్టడానికి ప్రత్యేక చట్టం చేయాలి.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

యువపాఠకులకు ఉపయోగం

28 జూన్ ఆదివారం ప్రజాశక్తి స్నేహలో అమెరికా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర వ్యాసం చదివాం. జులై 4 సందర్భంగా పాఠకులకు అమెరికా గతాన్ని, వర్తమానాన్ని అర్థం చేసుకోవడానికి క్లుప్తంగా రాశారు. అమెరికా చరిత్రను తెలుసుకోవాలనుకునే నేటి తరం యువ పాఠకులకు పరిచయ వాక్యాలుగా ఉపయోగపడ్డాయి. సామ్రాజ్యవాదులుగా చెలామణి అయి ప్రపంచాన్ని స్థానిక యుద్ధాలలోనూ, రెండు ప్రపంచ యుద్ధాల్లోనూ ముంచిన దుష్ట శక్తుల చరిత్రలను కూడా నేటి తరానికి పరిచయం చేస్తే ఉపయోగకరం. అందుకు రచయిత పూనుకోవాలని అభిలాష.

- పర్స సత్యనారాయణ,
హైదరాబాద్.

పుట్టినరోజు బాగుంది

ఈ వారం 'తమాషాగా'లో వచ్చిన క్రికెట్ మేనియా మాకు బాగా నచ్చింది. నిజంగానే బహిరంగ స్థలాల్లో క్రికెట్ చూడడాన్ని బ్యాన్ చేస్తే బాగుంటుందనిపిస్తుంది. పుట్టిన రోజు కథ బాగుంది. సమ్‌థింగ్ స్పెషల్ అంటూ దానిమ్మ గురించి మాకు తెలియని విషయాలను తెలియజేసినందుకు ధన్యవాదాలు.

సి.వి.ఆర్, ప్రొద్దుటూరు.

తమాషా కాదు వాస్తవమే

గని సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది. ఈవారం సంచికలో వచ్చిన క్రికెట్ మేనియా తమాషాగా కాదు వాస్తవం కూడా అదేనని ప్రతి ఒక్కరికీ తెలుసు. 'విజ్ఞాన వీచిక'లో ప్రమాదకర ప్రయోగాలు మాకు తెలియని విషయాలను తెలిపింది. 'బాల నేస్తాలు'లో బ్రిడ్జి బావుందా! అంశం మాకు బాగా నచ్చింది. అలాగే సముద్రపు గుర్రాన్ని గురించి కూడా తెలుసుకున్నాం. 'మనలో మాట' లో వచ్చిన మృగాళ్లు నిజంగా మృగాల్లాగే ప్రవర్తిస్తున్నారు. కథ మాకు బాగా నచ్చింది.

ఎం. సూర్యప్రకాశరావు,
పెదరావూరు.

తృప్తి కలిగింది

ఈ వారం 'కవర్ స్టోరీ' ఊయల ఊగినదోయి మనసు... చదువుతుంటే సంగీతం గురించి ఏమీ తెలియని మాకు దాన్ని గురించి కొంచెమైనా తెలుసుకున్నామన్న తృప్తి కలిగింది. శాస్త్రీయ సంగీతంలోని రకాల గురించి కూడా తెలుసుకున్నాం. తెలుసుకుందామా అంటూ తిరువనంతపురం గురించి తెలిపారు. కానీ మరి కొంత సమాచారం అందిస్తే బాగుండేది. గని సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది.

రమణ, కిషోర్,
నందిగామ.

స్వాత్ చిన్నారులకు మంచి రోజులెప్పుడో

జూన్ 21వ తేదీ స్నేహలో మీరందించిన విజ్ఞాన వీచికలో చెప్పినట్టుగా ఈ శాస్త్రీయ ప్రయోగాలు మేలు కొరకు జరిపినా వాటివల్ల కాస్తో కూస్తో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వీరు

చేస్తున్న జన్యు మార్పిడి ప్రయోగాల వల్ల నేడు తినే పండ్లలో, కూరగాయలలో వస్తున్న మార్పులు భయాన్ని కల్గిస్తున్నాయి. 'అరుగు' కవిత బాగుంది. పాకిస్తాన్‌లోని స్వాత్ చిన్నారులకు వారి బాధలన్నీ పోయేలా మంచి రోజులు రావాలని, త్వరలోనే వస్తాయిని కోరుకుంటున్నాం.

హరిత, రామారావు, సిరి,
రంగారెడ్డి.

మాకు బాగా నచ్చినవవే...

ఈవారం అట్టమీది కథ లో సంగీతం గురించి సవివరంగా అందించినందుకు ధన్యవాదాలు. విజ్ఞాన వీచిక, కథ, మనలో మాట మాకు బాగా నచ్చిన శీర్షికలు. వర్షాకాలంలో వచ్చే చెవులకు సంబంధించిన ఇన్‌ఫెక్షన్ల గురించి 'ఆరోగ్యం'లో చక్కగా వివరించారు.

సుమతి.టి, ఒంగోలు.

★



కథా నిలయం

ఆరోగ్యం

సెరిబ్రల్ పాల్సీ ఎందుకొస్తుంది?

కృష్ణవేణి ప్రభుత్వాసుపత్రిలో ప్రసవించింది. బాబు పుట్టాడు. ఆరు వారాలైనా నవ్వలేదు. మూడు నెలలు దాటినా మూసిన గుప్పెట తెరవలేదు. దీంతో కృష్ణవేణి బాబును డాక్టర్ దగ్గరకి తీసువెళ్లింది. డాక్టర్ పరీక్షించి, ఇది మెదడుకు సంబంధించిన వ్యాధిలా ఉందన్నారు. పిల్లల మెదడు వైద్యుని వద్దకు వెళ్లమని సూచించారు. ఇతని లక్షణాలను బట్టి ఇది సెరిబ్రల్ పాల్సీ అని వైద్యుడు చెప్పారు. అయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాధి ముదరకముందే చికిత్స చేస్తే నయమవుతుందని కూడా తెలిపారు.

డాక్టర్ పి నాగభూషణరావు,
పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్,
హైదరాబాద్.

గర్భస్థశిశువుగా వున్నప్పుడు గానీ, కాన్పు సమయంలోగానీ, పుట్టిన తరువాత గానీ, మెదడుకు ఏ కారణం వల్లనైనా నష్టం జరిగితే సెరిబ్రల్ పాల్సీ వస్తుంది. సాధారణంగా సెరిబ్రల్ పాల్సీకి ఒకటి కంటే ఎక్కువ కారణాలు ఉంటాయి.

కారణాలు

వంద కారణాల్లో తొంభై కారణాలను మనం నివారించలేకపోవచ్చు. గర్భవతిగా ఉన్నపుడు కల్లు తాగడం, పొగ పీల్చడం, మత్తుమందులు వాడటం, గర్భస్థశిశువుకు ప్రాణవాయువు సరిగా అందకపోవడం, జన్యుపరమైన కారణాలు, నెలలు నిండకుండా పుట్టడం, ప్రసవం కష్టమవ్వడం, పుట్టిన వెంటనే శిశువు గాలి పీల్చుకోలేక పోవడం, తలకు దెబ్బతగలడం వల్ల ఇది వస్తుంది. ఇవే కాక మెదడుకు క్రిములు సోకడం (మెదడువాపు), చవకరకం రంగుతో చేసిన బొమ్మలను పిల్లలు నోట్లో పెట్టుకోవడం మరో కారణం. సెరిబ్రల్ అంటే మెదడు, పాల్సీ అంటే బలహీనత. బలహీనత అంటే చేతులు, కాళ్లు గట్టిగా ఉండడం, కాళ్లు చేతులు కత్తెర మాదిరిగా పెట్టడం, సరిగా నడవకలేకపోవడం, ముఖకవళికల్లో మార్పులు, బుద్ధిమాంద్యం, చూపు, వినికిడి లోపాలు. చిన్నతనంలో మెదడుకు వచ్చే వ్యాధుల వల్ల ఇలా జరుగుతుంది. దీని ప్రభావం పిల్లల ఎదుగుదల, అభివృద్ధి, తుంటి కాళ్లపై పడుతుంది.

ఎలా గుర్తించాలి.....?

పుట్టిన ఆరువారాలకు కూడా పిల్లలు నవ్వకపోవడం. మూడు నెలలైనా మూసుకున్న గుప్పెట తెరవకపోవడం, తల్లి పిలిచినా నవ్వకపోవడం, శబ్దం విని ఉలిక్కిపడకపోవడం. ఆరు నెలలు దాటినా బోర్లాపడకపోవడం, ఎనిమిది నెలలు దాటినా కూర్చోకపోవడం, పది నెలలైనా కొత్తవాళ్లను చూస్తే ఏడ్వకపోవడం, తల్లిదండ్రులు బయటికి వెళ్తుంటే మారాం చేయకపోవడం, పాకకపోవడం, 13 నెలలు వచ్చినా అడుగులేయకపోవడం, రెండేళ్లలోపు ఒకే చేత్తో తినడం సెరిబ్రల్ పాల్సీ లక్షణాలు.

పరీక్షలు...

అవసరాన్ని బట్టి తుంటి కీళ్లను, థైరాయిడ్ గ్రంథిని పరీక్షించాలి. ఫిట్స్ ఉంటే ఇఇజి పరీక్ష చేయించాలి.

చికిత్స

దీన్ని సరైన సమయంలో గుర్తించి, వెంటనే చిన్న పిల్ల మెదడు వైద్యున్ని సంప్రదిస్తే చాలామటుకు నయమవుతుంది. అవసరాన్ని బట్టి ఎముకల వైద్యున్ని, కంటి వైద్యున్ని, ఇఎన్‌టి వైద్యుడ్ని సంప్రదించాలి. వీరేకాక డెవలెప్‌మెంటల్ థెరపిస్ట్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్, స్పీచ్ థెరపిస్ట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్లీ హ్యాండికాప్డ్, మనోవికాస్ నగర్, సికింద్రాబాద్) కలవాలి. అవసరమైతే సంఘసేవకుల సేవలు వినియోగించుకోవాలి.

చేతులు, కాళ్ల గట్టిదలను తగ్గించడానికి మందులున్నాయి. చూపును సరిచేయడానికి కళ్లద్దాలు ఉపయోగించవచ్చు. వినికిడిశక్తి లోపిస్తే హియరింగ్ ఎయిడ్ ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చు. ఒక కుటుంబంలో ఒకరికి కంటే ఎక్కువ మందికి రాదు. ఒక వేళ వస్తే అది సెరిబ్రల్ పాల్సీ కాదు.

నివారణోపాయాలు...

గర్భవతిగా ఉన్నపుడు క్రమం తప్పకుండా చెకప్ చేయించుకోవాలి. ఆహారంలో తప్పకుండా పోషకపదార్థాలుండాలి. డాక్టర్ సలహా మేరకే మందులు వాడాలి. అనవసరంగా ఎక్స్‌రే, సిటి స్కాన్ చేయించుకోకూడదు. ప్రసవం ఆసుపత్రుల్లోనే జరగాలి. రెబెల్లా టీకాలు వేయించుకోవాలి. పుట్టిన వెంటనే పిల్లల వైద్య నిపుణునికి చూపించాలి. తలకు దెబ్బ తగిలితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. పెరుగుదలలో మానసిక పరిపక్వత ఆలస్యంగా కనిపిస్తే వెంటనే పిల్లల మెదడు స్పెషలిస్ట్‌ను సంప్రదించాలి.

★

స్ఫూర్తి

వై.జోయా

సిపిఐ (ఎం) కృష్ణా జిల్లా కమిటీ సభ్యురాలు

అమ్మ ఇచ్చిన స్ఫూర్తితోనే...

పావెల్ జైలులో వున్నప్పుడు శిక్ష విధిస్తారని తెలిసినప్పుడు 'అమ్మ'కు తన కొడుకుతో పాటు జైలులో వున్న అతని నేస్తాలంతా తలుపుకు రావడం ఆశ్చర్యపరుస్తుంది. తన కళ్లకు అందరూ సమానంగా కనపడే విధానం స్ఫూర్తినిచ్చింది. నిజమైన తల్లి మనసంటే అలాగే వుంటుందనిపించింది. పైగా పట్టణాలలో ఉండే కార్మిక పోరాటాలతో పాటు గ్రామాలలో వున్న రైతాంగాన్ని ఉద్యమంలోకి తీసుకురావాలన్న ఆరాటంతో ఆమె అనేక విధాలుగా కరపత్రాల్ని రహస్యంగా పంపిణీ చేసి రైతాంగాన్ని చైతన్య పరిచిన విధానం బాగా నచ్చింది. నేను రైతు ఉద్యమంలో పనిచేయడానికి స్ఫూర్తినిచ్చిన అంశాల్లో ఇది కూడా ప్రధానమైనదే.

నేటికీ మహిళలను రాజకీయంగా అన్నిరంగాలలో అభివృద్ధి చేసుకోవడానికి, 50 శాతంగా ఉన్న నేటితరం మహిళలు ఉద్యమంలోకి రావడానికి 'అమ్మ' నవల మార్గదర్శకంగా ఉంటుందనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు.

నాకు స్ఫూర్తినిచ్చిన పుస్తకం గురించి రాసివ్వమని ప్రజాశక్తివారు నన్ను అడిగినపుడు నేను చదివిన అనేక పుస్తకాలు గుర్తుకొచ్చాయి. వాటిలో నాకు మక్సీమ్ గోర్కీ రాసిన "అమ్మ" నవల అమితంగా స్ఫూర్తినిచ్చింది. ఈ నవల చదివినప్పుడు అందులోని అమ్మ నీలోవ్నా లాగా ఉద్యమం కోసం పనిచేయాలనిపించింది. ఆ ప్రేరణతోనే రైత్యాంగ ఉద్యమంలో పనిచేస్తున్నా.

మాది కృష్ణాజిల్లా దివి తాలుకా చిన్నకళ్ళేపల్లి గ్రామం. మాది భూస్వామ్య కుటుంబం. చుట్టు పక్కల గ్రామాలన్నీ చల్లపల్లి జమిందారు ప్రాభల్యంలో ఉండేవి. ఆ గ్రామాలలో చల్లపల్లి జమిందారు పెత్తనం చెలాయించేవాడు. అప్పటికే (1930 సం॥) మా పెద్ద తల్లి గుత్తికొండ శేషమ్మగారు జాతీయోద్యమంలో పాల్గొని జైలు కెళ్లారు. ఆ ప్రభావం మా కుటుంబ సభ్యులందరిపైన పడింది. 1946-1952 వరకు దివితాలుకాలో చల్లపల్లి జమిందారు భూస్వామ్య పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు జరుగుతుండేవి. నాకు ఏడు సంవత్సరాలప్పుడు మా అమ్మానాన్నను జైళ్ళలో నిర్బందించారు. అప్పటినుండే నా దృష్టి అభ్యుదయ భావాలవైపు మళ్ళింది. చల్లపల్లిలో హైస్కూలు విద్య పూర్తిచేసి పియుసి చదవడానికి బందరు హిందూ కాలేజీలో చేరాను. విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొనేదాన్ని. 1958లో గుంటూరులో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహసభలకు కూడా హాజరయ్యా. ఆ సందర్భంగా పుస్తకాలు చదివే అలవాటు చేసుకొన్నా. సరిగ్గా అప్పుడు "అమ్మ" నవల చదివాను. అందులో అమ్మ నీలోవ్నా పరిణతి చెందిన తీరు నన్నెంతగానో ఆకట్టుకుంది. నీలోవ్నా మొదట సాధారణ గృహిణిగా జీవితం నెట్టుకొస్తుండేది. భర్త వల్ల అనేక ఇబ్బందులు పడుతుండేది. అప్పటికే రష్యాలో పెట్టుబడిదారీ వర్గం కార్మికులను పలు ఇబ్బందులకు గురిచేసేది. దానికి వ్యతిరేకంగా కార్మికుల పక్షాన పని చేసే కొడుకు పావెల్ స్ఫూర్తితో మానసిక పరిపక్వత చెంది కామ్రేడ్ల కష్టసుఖాలలో ముందు నిలిచే విధానం నాకు నచ్చింది.

ఈ నవల చదివేటప్పుడు చల్లపల్లి జమిందారీ వ్యతిరేకపోరాటంలో మహిళలు నిర్వహించిన పాత్ర గుర్తుకొచ్చేది. పావెల్ తల్లి గ్రామాలలో రైతాంగాన్ని చైతన్య పరచడానికి రహస్యంగా కరపత్రాలను పంపిణీచేయడం వంటి విషయాలను పోలివుండేవి. ఒక రోజు మా గ్రామంలోని సీతమ్మగారి ఇంట్లో సమావేశమైన మహిళలకు ఓ కొరియర్ రహస్య కరపత్రాలను ఇచ్చి వస్తుండగా మలబారు పోలీసులు విషయం తెలుసుకొని ఆఇంటిని చుట్టుముట్టారు. దాంతో విషయం బయటకు పొక్కకుండా వుండటానికి కొంతమంది మహిళలు కరపత్రాలను నమిలి మంగివేశారు. కొంత మంది జబ్బున పడ్డట్లు నటిస్తూ ఉద్యమాన్ని కాపాడిన వైనం గుర్తుకొచ్చాయి. పావెల్ తల్లి తన చుట్టూ జరిగే విషయాలను తెలుసుకోవాలనే ఉబలాటంతో, చదువుకోవాలనే తపనతో బహిరంగంగా చదవటానికి సిగ్గుపడి దొంగచాటుగా చదువు నేర్చుకొన్న వైనం కూడా నన్ను ఆకట్టుకుంది.

దాదాపు అలాంటి సంఘటనే మా ఊళ్లోనూ జరిగింది. అక్కడ పెద్ద మల్లె చెట్టు ఒకటుండేది. దానికి సంరక్షణ చేయగా పూసిన మల్లెపూలను అమ్మేవారు. ఆ డబ్బుతో మహిళందరూ కలసి ఒక పత్రికకు సంవత్సర చందా కట్టారు. అలా పార్టీ విషయాలు తెలుసుకోవటమే కాకుండా ఆ విషయాలను మెగా ఫోన్ ద్వారా గ్రామంలో మహిళలందరికి చదివి వినిపించేవారు.

మా గ్రామంలో గుత్తికొండ అన్నపూర్ణమ్మ అనే మహిళ చల్లపల్లి జమిందారుకి వ్యతిరేకంగా పనిచేస్తున్నపుడు పోలీసులు పట్టుకొని నాయకులు పేర్లు, వారున్న ప్రదేశాలు చెప్పమని ఎంతగా నిర్బంధించి చిత్రహింసలకు గురిచేసినా పెదవి విప్పకుండా ఉద్యమాన్ని కాపాడుతుంది. ఇలాంటి ఘటనలు అమ్మ నవలలో సోఫ్యా, పాషా పాత్రలు వచ్చినప్పుడు నా కళ్ళకు కట్టినట్లు కనిపించాయి.

పావెల్ జైలులో వున్నప్పుడు శిక్ష విధిస్తారని తెలిసినప్పుడు 'అమ్మ'కు తన కొడుకుతో పాటు జైలులో వున్న అతని నేస్తాలంతా తలుపుకు రావడం ఆశ్చర్యపరుస్తుంది. తన కళ్లకు అందరూ సమానంగా కనపడే విధానం స్ఫూర్తినిచ్చింది. నిజమైన తల్లి మనసంటే అలాగే వుంటుందనిపించింది. పైగా పట్టణాలలో ఉండే కార్మిక పోరాటాలతో పాటు గ్రామాలలో వున్న రైతాంగాన్ని ఉద్యమంలోకి తీసుకురావాలన్న ఆరాటంతో ఆమె అనేక విధాలుగా కరపత్రాల్ని రహస్యంగా పంపిణీ చేసి రైతాంగాన్ని చైతన్య పరిచిన విధానం బాగా నచ్చింది. నేను రైతు ఉద్యమంలో పనిచేయడానికి స్ఫూర్తినిచ్చిన అంశాల్లో ఇది కూడా ప్రధానమైనదే.

నేటికీ మహిళలను రాజకీయంగా అన్నిరంగాలలో అభివృద్ధి చేసుకోవడానికి, 50 శాతంగా ఉన్న నేటితరం మహిళలు ఉద్యమంలోకి రావడానికి 'అమ్మ' నవల మార్గదర్శకంగా ఉంటుందనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు.

★

చరిత్రకు సాక్షి విసునూరు గడి

చూపరుల మదిని కొల్లగొట్టడం ఆ గడి ప్రత్యేకత. వృత్తిదారులు, కార్మికుల చెమటతో నిర్మించిన విసునూరు గడి ప్రస్తుతం ఆనాటి రాచరికపు కళ కోల్పోయి దర్శనమిస్తుంది. ఎక్కడో కాదు వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం విసునూరు గ్రామంలో. ఉపసేనాధిపతి రాపాక వెంకటరాంచంద్రారెడ్డి నిజాం ప్రభువు నమ్మిన బంటు. అరవై గ్రామాల రజాకార్లకు అధిపతి ఆయన. ఈ ప్రాంతంలో ఆయన చెప్పిందే వేదం. దొర మాట ధిక్కరిస్తే పాడె ఎక్కాల్సిందే. నలభై వేల ఎకరాల భూస్వామిగా వెలుగొందాడు. రాంచంద్రారెడ్డి రాక్షస పాలన సాగించేవాడని నేటికీ అలనాటి పోరాట యోధులు గుర్తుచేసుకుంటారు. కుమారుడికి చూసిన అమ్మాయిని తాను పెళ్లి చేసుకున్న చరిత్ర సదరు పెద్దమనిషిది. వియ్యంకుడితో సవాలు చేసి మరీ ఈ ప్రాంతంలోనే లేనటువంటి అధునాతన భవనాన్ని 1942 దశకంలో కట్టించాడు. ఆ రోజుల్లోనే ఈ భవనానికి రెండు లక్షల రూపాయలకు పైగా వెచ్చించారు. భవనం నిర్మించిన కూలీలకు, కార్మికులకు, వృత్తిదారులకు ఎటువంటి ప్రతిఫలం ఇవ్వలేదు. ఆ గడికి ఖర్చు చేసిన ధనమంతా ప్రజల సొమ్మే. భవన నిర్మాణానికి ప్రజలను వేధించి నిర్బంధంగా నజరానాలను వసూలు చేయించాడు దేశ్‌ముఖ్. దీనికి నిర్మాణ ప్లాన్ మాజీ మంత్రి వల్లూరి బసవరాజు సమకూర్చారు.

- మామిండ్ల రమేష్ రాజా

విసునూరు భవనం కోసం 60 గ్రామాల్లోని పెద్ద పెద్ద తుమ్మ చెట్లను నరికించారు. పని చేసిన కార్మికులకు ప్రతిఫలం ఇవ్వకుండా రైతుల ఎడ్ల బండ్లలో కర్రనంతా విసునూరు చేరవేశారు. ఇటుక బట్టీలు, సున్నపు బట్టీలు పెట్టారు. 20 గజాల లోతు, మూడు గజాల వెడల్పుతో పునాదులు తీయించారు. పునాదులు తీయించేటప్పుడు ఊరిన నీటిని ఆయిల్ ఇంజన్లతో బయటకు తోడించారు. సున్నం, కంకరతో దిమ్మస చేస్తూ బేస్‌మెంట్ లేపారు. ప్రహరీ గోడకు రెండు గజాల వెడల్పుతో ఐదు గజాల లోతు పునాదులు తీయించారు. ఒకటిన్నర అడుగుల వెడల్పు ఉండేట్లు ఐదు గజాల ఎత్తుతో ఐదు ఎకరాల వెడల్పు గోడ నిర్మించారు. హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుండి భవన నిర్మాణ కూలీలను, మేస్త్రీలను రప్పించారు. మూడు సంవత్సరాలలో భవన నిర్మాణం పూర్తిచేశారు. తన ఇంటికి ప్రత్యేకంగా విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేసుకున్నారు. జనరేటర్ సౌకర్యంతో ఓ గదిని నిర్మించారు.

కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా ఏ నిర్ణయం అయినా ఈ గడినుండే వచ్చేది. కమ్యూనిస్టులను నామరూపాల్లేకుండా చేయాలని దొరలు, భూస్వాములు విసునూరు గడిలోనే సమావేశాలు జరిపేవారు. పోలీసులు, ఉన్నతాధికారులు సైతం దేశ్‌ముఖ్ దర్శనం చేసుకుని విందు, పొందులతో జల్సాలు చేసి వెళ్లేవారు. దొర ఆదేశానుసారం ఓ పచ్చి బాలింత, పసిపాపను గడి ముందు పడుకోబెట్టి పొలంలోకి వెళ్లాల్సి వచ్చింది. దాంతో పాలు లేక గుక్కపట్టి పసిపాప కన్నుమూసింది. పిల్లలకు పాలు ఇవ్వాలన్నా పనిలోంచి వెళ్లనిచ్చేవారు కాదు. ముందుగా మోదుగ డొప్పలో పాలు పితికి చూపించాలి. ఆపాలను నేలపాలు



విసునూరు భవనం

చేసేవాడు దొర రాంచంద్రారెడ్డి. ఆంధ్రమహాసభ నాయకులను విసునూరు ప్రజలు కలిసొచ్చారని గడిలోనే వరుసగా నిలబెట్టి వాళ్లను గూండాలతో కొట్టించారు. దెబ్బలకు తాళలేక స్పృహ కోల్పోయారు కొందరు. మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారు. దొరలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన శాంతపురం ఇటుకల బక్కయ్యను చిత్రహింసలు పెట్టారు. గడి గోడలపై పడుకోబెట్టి బరువైన బండరాళ్లను కాళ్లకు, చేతులకు కట్టి వేళ్లాడదీసి ప్రాణాలు తీయించాడు. బయటి గ్రామాల్లోంచి పడుచు అమ్మాయిలను బలవంతంగా ఎత్తుకొచ్చి గడిలో బతుకమ్మ ఆడించాడు రాంచంద్రారెడ్డి. తమ కోర్కెలను ఆ విధంగా తీర్చుకున్నారు. అన్ని రకాల నేరాలకు, కుట్రలకు విసునూరు గడి కేంద్రంగా మారింది.

భవనం ముందు రజక స్త్రీలు ప్రతిరోజు 500 బిందెల నీళ్లతో కళ్లాపి చల్లేవారు. తన విలాస జీవితం కోసం హైదరాబాద్‌లో తప్ప మరెక్కడా కార్లులేని ఆరోజుల్లో ఇంగ్లాండు నుండి కారు తెప్పించుకుని జల్సా చేశాడు దేశ్‌ముఖ్. విసునూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి కూమారుడు నేరాలు చేయడంలో తండ్రి కంటే ఘనుడు. దేశ్‌ముఖ్ కుమారుణ్ణి జగన్‌మోహన్‌రెడ్డి (బాబు దొర) అని పిలిచేవారు. కనిపించిన ప్రతి యువతి తన గడికి రావాలనే కామ పిశాచి. గుర్రపు స్వారీ చేస్తూ 40–50 మంది బలగంతో వెళ్లి తన పనులు నెరవేర్చుకునే క్రూరుడిగా పేరొందాడు. చివరికి ప్రజల చేతిలో జనగామ రైల్వే స్టేషన్‌లో హత్యకు గురయ్యాడు. ఆంధ్రమహాసభ కార్యకర్తలు (వృత్తిదారులు, కార్మికుల శ్రమ దోపిడీతో నిర్మించిన పాలకుర్తి వీరమనేని శేషగిరిరావు గడిని కూల్చి అదే స్థలంలో మొక్కజొన్న పంట పండించి కాల్చుకు తిన్న స్ఫూర్తితో) దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి గడిని కూల్చాలని కంకణం కట్టుకున్నారు.

1948 సెప్టెంబరు 16న సుమారు 10వేల మంది ప్రజలను సమీకరించి విసునూరు గడిని కూల్చేందుకు సిద్ధమయ్యారు. కత్తులు, గొడ్డళ్లు, పారలు, పలుగులు తీసుకుని 10 దళాలుగా ఏర్పడ్డారు. సాయంత్రం వేళ గడిని చుట్టుముట్టారు. చీమల దండుగా కదిలి వచ్చిన జనాన్ని చూసిన దేశ్‌ముఖ్ గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. తనకు మరణం తప్పదని గడిలోనే దాగి వున్నాడు. అప్పటి వరకు దొర అడుగులకు మడుగులొత్తిన పోలీసులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వుండిపోయారు. అప్పటికే చిటపట చినుకుల్లా పడిన వర్షం కుండపోత వర్షంగా మారడంతో భవనాన్ని కూల్చలేమని, ఆ వర్షంలో భవనాన్ని కూలిస్తే ప్రజలకు ప్రమాదమని భావించిన నాయకులు ప్రజలను అతి కష్టం మీద వెనక్కి మళ్లించారు.

అదే రాత్రి జె.ఆర్.చౌదరి సందేశం విన్న కార్యకర్తలు భవనం కూల్చకుండా శాంతించారు. మరునాడు 18-9-1948న యూనియన్ మిలిటరీ యాక్షన్ జరిపి నిజాంను లొంగదీసుకున్నారు. ఒకప్పుడు గడి చుట్టూ వేల ఎకరాల పండ్ల తోటలుండేవి. తనకు ప్రాణభయం వుందని పసిగట్టిన దేశ్‌ముఖ్ ముందస్తుగా శత్రువుల దాడి నుండి తప్పించుకునేందుకు వేల ఎకరాల పండ్ల తోటల్ని నరికించాడు. విసునూరు గడి ఆలనా, పాలనా కరువైంది నేడు. గతంలో ఆ గడిలో ఓ సినిమా తీశారు. సందర్శకులకు వీలుగా ... కాల గర్భంలో కలుస్తున్న భవనాన్ని దేశ్‌ముఖ్ వారసుల నుండి ప్రభుత్వం స్వాధీనపర్చుకోవాలన్న డిమాండ్ ప్రజలనుండి, కొన్ని రాజకీయ పార్టీలనుండి వినిపిస్తోంది. గడిని పోరాట యోధుల స్మారక కేంద్రంగా మార్చటం ఉత్తమం.

(అలనాటి పోరాట యోధులు జీడి సోమనర్సయ్య, కమ్మరి బ్రహ్మయ్య, మామిండ్ల కొమురయ్యల ఇంటర్వ్యూల ఆధారంగా...)

విజ్ఞాన వీచిక

పనికొచ్చే సూక్ష్మజీవులు



ఆంటన్ వాన్ లీవెన్‌హాక్ అతి సామాన్యమైన సూక్ష్మదర్శినికి రూపకల్పన చేశాడు. నీటి చుక్కలు, వెనిగార్ చుక్కలు, మనిషి పళ్ళ మధ్య మిగిలిపోయిన ఆహారపు అణువులు వంటి ఎన్నో పదార్థాలు తన సూక్ష్మదర్శినిలో పరీక్షించాడు. అతి చిన్నగా ఉండి కదులుతూ ఉండే ఆ జీవుల్ని 'యానిమల్‌క్యూల్స్' అన్నాడు. ఆయన గమనించిన వివరాల్ని లండన్‌లోని రాయల్ సొసైటీకి తెలియజేశాడు. మైక్రోస్కోపు కనుగొనడమన్నది మానవ వికాసంలో ఒక విలువైన మలుపు. మైక్రోస్కోపు రావడంతోనే బ్యాక్టీరియా, వైరస్ వంటి మైక్రో ఆర్గానిజమ్స్ ఉన్నాయని తెలిసింది. ఒక కొత్త సూక్ష్మజీవుల ప్రపంచమే మానవుడి ముందు వెలసింది. జీవశాస్త్ర అధ్యయనానికి అల్లోపతి వైద్యానికి ఎంతో బలం చేకూరింది. సూక్ష్మజీవుల అధ్యయనాన్నే 'మైక్రోబయాలజీ' అన్నారు. పీల్చే గాలిలో, తాగే నీటిలో, పాలలో కూడా సూక్ష్మజీవులున్నాయని తెలిసింది. కూరగాయలు, మాంసం వంటి ఆహార పదార్థాలన్నీ సూక్ష్మజీవుల కారణంగానే కుళ్ళిపోతున్నాయని తెలిసింది. మైక్రోబయాలజీ గిరోలానో ఫ్రాకాస్ట్రో, లాజారో స్పాలాంజిని, లూయిస్ పాశ్చర్ వంటి శాస్త్రవేత్తలంతా ఒక పథకం ప్రకారం ప్రయోగాలు కొనసాగించారు. సూక్ష్మజీవుల వల్లనే మానవులకు ఎన్నో రోగాలు సోకుతున్నాయని, ఒక్కొక్క సూక్ష్మజీవి ఒక్కోరకమైన రోగాన్ని వ్యాప్తి చేస్తుందని కనుగొన్నారు. జీవ శాస్త్రంలో 'పాథాలజీ' అనే విభాగం ఎంతో అభివృద్ధి చెందింది. ఒక రకంగా ఆధునిక వైద్య విజ్ఞానం దాదాపు మొత్తానికి మొత్తంగా మైక్రోస్కోపుపైనే ఆధారపడి ఉంది.

- డాక్టర్ దేవరాజు మహారాజు

(సన్నగా నేపథ్య సంగీతం వినిపిస్తోంది - కొందరు విరగబడి నవ్వుతున్నారు)

ఒకరు: ఏమండీ మీరిది విన్నారా? మన లూయీస్ పాశ్చర్ చేస్తున్న నిర్వాకం?

మరొకరు: ఏమిటీ ఏం చేస్తున్నాడూ; ఏదో కొత్త పరిశీలనలు చేస్తున్నాడని విన్నాను.

ఒక : కొత్త పరిశీలనా లేదు, చట్టుబండాలేదు. ఆయన గారికి ప్రపంచమంతటా సూక్ష్మజీవులే కనిపిస్తున్నాయి.

మరొకరు : అదెట్లా ?

ఒక : సూక్ష్మజీవుల వల్లే పాలు పెరుగుగా మారుతుందట. సూక్ష్మ జీవులవల్లే మాంసం కుళ్ళిపోతోందట. అసలు ఎక్కడా ఏమీ కనబడంది. ఏమైనా నమ్మడానికి వీలుందా? పచ్చకామర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందట. ఇదీ అలాగే ఉంది.

మరొకరు : ష్... ! పాశ్చర్ మహాశయుడు ఇటే వస్తున్నాడు.

ఒక : (వ్యంగ్యంగా) మహానుభావుడు. ఉత్తపుణ్యానికి గొప్ప శాస్త్రవేత్త అయికూర్చున్నాడు. ఆకాడికి మనం చేస్తున్న పరిశోధనలు దేనికీ పనికి రానట్టూ పెద్ద పోజు పెడతాడు.

మరొక : ష్.... ఆగు. బూట్ల చప్పుడు దగ్గరవుతోంది. గుడ్ మార్నింగ్ పాశ్చర్.!

లూయీ పాశ్చర్ : వెరీ గుడ్ మార్నింగ్.

ఒక: (వ్యంగ్యంగా) ఏమిటీ ఈ మధ్య మీ పేరు అంతటా మారుమోగిపోతోంది.

పాశ్చ : ఎందుకూ?

మరొక : మీరు ప్రతి దానిలోనూ సూక్ష్మజీవులున్నాయిని అంటున్నారట. కొందరు దానితో ఏకీభవించడం లేదు.

పాశ్చ : దానికి నేను చేసేదేం లేదు. మిస్టర్ లాజరో స్పాల్లాంజని గాలిలో సూక్ష్మజీవులున్నాయన్నాడు. అది అక్షరాలా నిజం. మైక్రోస్కోపు వాడుకలోకి వచ్చాక వాటిని మనం స్పష్టంగా చూడగలుగుతున్నాం. జర్మనీ శాస్త్రవేత్త రాబర్ట్ కోచ్ కూడా వ్యాధుల్ని వ్యాప్తి చేసే సూక్ష్మజీవుల వివరాలు తెలియజేస్తున్నాడు. అందువల్ల ఏ కొందరికో సమ్మతం కాకపోతే పోయిందేమీ లేదు.

ఒక : (వ్యంగ్యంగా) అది సరే సూక్ష్మజీవులకు పెరుగు తయారు కావడానికి సంబంధం ఉందంటున్నారట. అదేంసంగతీ?

పాశ్చ : అవును. పాలు బాగా మరగబెడితే అందులోని సూక్ష్మక్రిములు చచ్చిపోతున్నాయి. పాలు విరిగిపోకుండా ఉంటున్నాయికదా?

ఒక : అయితే ఇప్పటి నుండి మరగ బెట్టిన పాలను పాశ్చరైజ్‌డ్ మిల్క్ అనుకుంటూ గ్లాసులు గ్లాసులు తాగుతారనుకుంటా. (పగలబడినవ్వుతూ) అయ్యా చెయ్యండి చెయ్యండి. మీ పరిశోధనలు మీరు చెయ్యండి. ఆలస్యమైతే మీ సూక్ష్మజీవులు పారిపోయేను. (పగలబడి నవ్వుతూ)

పాశ్చర్ : అందులో నవ్వాల్సిందేమీ లేదు. ఒక కొత్త పరిశోధన వెలుగులోకి వచ్చినప్పుడల్లా దానికి వ్యతిరేకత కూడా ఎంతో బలంగా వస్తుంది. విజ్ఞాన శాస్త్ర చరిత్ర ఏ కొంచెం తెలిసిన వారికైనా ఇది అవగతమౌతుంది.

సూత్రధారుడు : లీవెన్‌హాక్ మైక్రోస్కోపును వాడుకలోకి తేవడంలో అతని సమకాలికుడైన రాబర్ట్ హుక్ 1665లో జీవకణ స్వరూపాన్ని నిర్ధారించాడు. మొట్టమొదటిసారి వృక్షకణాలు మైక్రోస్కోపులో చూసినపుడు అవి దగ్గరదగ్గరగా తేనెతుట్టెలోని గదుల్లాగా.. కనిపించాయ. ఆ ఒక్కొక్క గదిని ఆయన 'సెల్' అని పిలిచాడు. వృక్షాల్లోనే కాదు, జంతువుల్లోనూ అలాంటి సెల్సే (జీవకణాలే) ఉన్నాయని తెలుసుకున్నాడు. ఎం.జె. స్కెలిడెన్ అనే వృక్ష శాస్త్రవేత్త, థియోడర్ షూవాన్ అనే జంతు శాస్త్రవేత్త కలిసి, పరిశీలనలు జరిపి 1839 లో జీవకణం అనేది జీవితంలో మూలాధార అంశమని సూత్రీకరించాడు. ఒక శరీరం తన జీవ క్రియలన్నీ ఎలా నిర్వహించుకుంటుందో శరీరంలోని ప్రతి కణమూ తన జీవక్రియలను అలాగే నిర్వహించుకుంటుంది. సులభంగా చెప్పుకుంటే జీవకణాలు తమ విధులు నిర్వర్తించుకుంటున్నాయి. కాబట్టి, శరీరం కూడ తన విధులు నిర్వర్తించుకుంటుంది.

★

ఉష్ణ రక్తం

సింహం: ఏయ్! మనిషీ నేను నిన్ను తినేస్తా...

మనిషి: దయచేసి నన్ను మాత్రం తినకు. ఇదిగో నా పక్కనే నిలబడ్డాడు కదా అతన్ని తినేసేయ్. ఎందుకంటే అతని రక్తం తాగితే కూలవుతారు. అతనిది శీతల రక్తం.

సింహం: కానీ నాకు ఉష్ణ రక్తం అంటేనే ఇష్టం.

అందంగా...

నీల: నీ లెటర్ చదివాను. కానీ ఇంకొంచెం అందంగా రాయొచ్చుకదా.

రామ్: రాయొచ్చుగానీ...అప్పుడు నేను రాసిన తప్పులన్నీ కనిపిస్తాయని!

కళ్లు మూసుకో

పాసెంజర్: రోడ్డు మీద వెళ్తున్నప్పుడు కారు ఏదైనా ఎదురొస్తే చాలా భయమేస్తుంది.

కారు డ్రైవర్: నాలాగా కళ్లు మూసుకోండి సార్ సరిపోతుంది.

తెల్సు!

టీచర్: రాజూ! 18వ శతాబ్దపు రాజుల గురించి నీకేమైనా తెల్సా!

రాజు: తెల్సు టీచర్.

టీచర్: ఏం తెల్సో చెప్పు?

రాజు: వాళ్లంతా చనిపోయారని టీచర్!

ఎరుపు రంగు

పై అధికారి: కానిస్టేబుల్! ఇప్పుడు మనం అర్జంటుగా ఒక దొంగను పట్టుకోవాలి. ఏదైనా ఉపాయం చెప్పవయ్యా!

కానిస్టేబుల్: ఆ...ముందుగా ఆ దొంగ చేతులకు ఎరుపు రంగు వెయ్యాలి సార్.

పై అధికారి: ఎందుకని?

కానిస్టేబుల్: అప్పుడే కదా సార్ వాణ్ణి రెడ్ హేండెడ్‌గా పట్టుకునేది.

నిద్ర మాత్ర

పనివాడు: అయ్యగారు! తొందరగా లేవండీ...

యజమాని: ఊ...

పనివాడు: అయ్యగారూ! నిద్ర లేవండీ...మీరు చేయాల్సిన అర్జంటు పని ఒకటుందండీ...

యజమాని: ఏ...వి...టో...య్!

పనివాడు: మరే...మీరు నిద్రమాత్ర వేసుకోవడం మర్చిపోయారండీ...ఇద్దామనీ....

నేనున్నాగా...

పేషెంట్: ఎందుకో తెలీదుగానీ... ఏదో ఒకటి చేసుకొని చచ్చిపోవాలనిపిస్తోంది డాక్టర్!

డాక్టర్: భలే వాడివే. నువ్వెందుకయ్యా తొందరపడతావ్. అందుకు నేనున్నాగా.

కష్టపడేది

నాన్న: మీ క్లాసులో అత్యంత ఎక్కువగా కష్టపడేది ఎవరో చెప్పు?

కొడుకు: నేనే

నాన్న: ఎలా?

కొడుకు: ఎందుకంటే క్లాసులో అందరు హాయిగా కూర్చుని వుంటే ఎక్కువ సమయం బెంచీమీద నిలబడేది నేనే కదా.

అన్నదాత

సుబ్బారావు: మా మేనల్లుడు తన చేతులమీదుగా వేలాదిమందికి భోజనం పెడ్తాడు తెల్సా!

అప్పారావు: అంటే అతగాడేమైనా సంఘసేవకుడా?

సుబ్బారావు: కాదు. హోటల్లో వెయిటర్.

సీరియల్



జరిగినకథ:

పూర్తి జీతంతో ఇల్లు చేరిన కార్మికులను వేళ్లమీద లెక్కించవచ్చు. ఎవరో ఒకరు, ఏదో ఒక విధంగా వారి కష్టార్జితాన్ని కాజేస్తుంటారు. పైగా వాళ్ల హక్కుల్ని కాలరాస్తుంటారు. శ్రమకు తగ్గ ఫలితం లేకుండా ఇల్లు చేరిన మగవాళ్లను చూసి విలపించే స్త్రీలు, వృద్ధులూ, యువకులూ, మధ్యవయస్కులు గుండెలు బండలు చేసుకొని వేదాంత ధోరణి అలవరచుకొని బతుకులు వెళ్లదీస్తుంటారు. మరోవైపు బికాస్ ఆరోగ్యం కుదుటపడుతుంది. కానీ గాయం తాలూకు బాధా, బలహీనతా పూర్తిగా తగ్గదు. పనిలోకి వెళ్లమని మనసు తొందరపెడుతున్నా... శరీరం వారిస్తుంది. బలవర్ధక ఆహారం తీసుకోగలిగే స్తోమత అతనికి లేదు. అయితే కొద్దిరోజులపాటు గంజాయి ఆకు కషాయం తాగితే అదనంగా ఆహారం తీసుకోకుండానే బలం చేకూరుతుందని చెప్పాడో స్వామీజీ. దానికి బికాస్ సోదరి ఎంతగానో సంతోషిస్తుంది. ఆ తర్వాత....

తమిళ మూలం : కె. చిన్నప్పభారతి

అనువాదం : వి. వెంకటేశ్వర

(పధ్నాలుగవ భాగం)

భుక్తాయాసము, హుక్కా మత్తు కలిసి నిద్రావస్థకి లాక్కెళుతున్నాయి. మూలిక ఎక్కడ లభిస్తుందో తెలుసుకోవాలన్న కోరికను ఆమె వెలిబుచ్చడంతో నిద్ర మత్తు దిగిపోయింది.

'అది మేము మాత్రమే తయారు చేయగలం. మేము సిద్ధి పొందిన వాళ్లం. మేము ఎన్నో ఏళ్ళు అడవుల్లో మునీశ్వరులకు శుశ్రూష చేసి సముపార్జించిన జ్ఞానమది. ఈ విషయాలు మీకు ఎంత చెప్పినా అర్థంకావు. మాలాంటి సిద్ధుల ఆలోచనల పట్లా, ఆంక్షల పట్లా కొద్దిపాటి అపనమ్మకం కలిగినా ఏ మందూ పనిచేయదు. లౌకిక జీవితం పట్ల ధ్యాసే లేకుండా ... అబ్బ, ఎన్నేళ్ళు గడిచాయి!' అంటూ అతడు తన, పొడుగాటి గడ్డం నిమురుకోసాగాడు.

ఇంటి ముందు రావి చెట్టు మీద ఏదో పక్షి అరుస్తోంది. ప్రేమ కోసమా? విరహ తాపంతోనా? తన పిల్లలు ఎక్కడ పడిపోతాయోనన్న బెంగతోనా? దేనికో అర్థం కాలేదు.

ఆ నాదంతో మమేకమైనట్టు వైద్య స్వాముల వారు కళ్ళు మూసుకొని, గడ్డం నిమురుకొంటూ కూర్చున్నాడు. తలను ఇటూ అటూ కదిలిస్తూ 'ఈ పక్షి కూత శుభ శకునం. అనుకొన్నది నెరవేరుతుందనీ, తలపెట్టిన పని పూర్తవుతుందనీ అంటారు' అన్నాడు.

ఈ విషయం ఆమెకు కూడా తెలుసు. గ్రామంలో తరతరాలుగా చెప్పుకొంటున్నదే. ఇందులో నిజానిజాల గురించి ఎవరూ ఆలోచించరు. నిజం కాని పక్షంలో తమ పూర్వీకులు నమ్మేవారు కాదనీ, ఒకవేళ ఎవరి విషయంలోనైనా నిజం కాకపోతే అది ఆ వ్యక్తి జీవితంతో విధి ఆడే నాటకమనీ విశ్వసిస్తారు.

స్వామివారి మురికి నిండిన వెంట్రుకలు జడలుజడలుగా ఉన్నాయి. పేల బాధతో అతడు సతమతమౌతున్నాడు. రెండు చేతుల్నీ జుట్టులోకి దూర్చి రుద్దుకోసాగాడు. దురద తగ్గిపోయినప్పుడు కలిగే హాయి అతడి ముఖకాంతిలో ప్రతిఫలించింది. పరిమళ భరితమైన కుంకుమా, చందనమూ అతడి దేహ దుర్గంధాన్ని హరించివేస్తున్నాయి.

"సిద్ధి పొందిన వాళ్ళు ఆహారం గురించీ, అలంకరణ గురించీ, శరీరం గురించి పట్టించుకోరు. విశ్వ రహస్యాలను తెలియజెప్పటానికీ, పాపాత్ముల్ని ధర్మ మార్గాన నడిపించడానికీ, దుఃఖ బాధితులకు స్వర్గాన్ని గుర్తు చేయడానికీ తమ శక్తియుక్తుల్ని, ధనాన్ని వినియోగిస్తారు. వాళ్ళకు ఇహలోక చింతన ఉండదు" అన్న మాటల్ని ఆమె గుడిలో ధర్మ ప్రసంగాల్లో విని ఉంది. దీని పట్ల ఆమె పూర్తి అవగాహన ఏర్పరచుకోలేక పోయిందిగానీ, ఆమె చిత్తంలో భక్తిరసం పొంగిపొర్లుతోంది.

"అలా అయితే మీరే తయారు చేసిస్తారా స్వామీ! దేవుడు మీ రూపంలో వచ్చి బీదలకు సహాయ పడతాడు కాబోలు" అని ప్రశాంతంగానూ, వినయవిధేయతలతోనూ చెప్పింది.

స్వామివారి చిత్తంలో దురాశ రెక్కలు విప్పసాగింది.

"నేనిచ్చే మందుతో ముసలివాడు సైతం యువకుడిగా మారిపోతాడు. బంగారాన్ని భస్మంచేసి, దానిలో మూలిక రసాన్ని కలిపి బాగా రుబ్బి చందనం తయారు చేసుకోవాలి. దాన్ని నీడ పట్టున అర బెట్టి, పాలలోగానీ, మజ్జిగలోగానీ ఓ చిటికెడు కలిపి తాగాలి. మంచం పట్టిన వాడు సైతం పదిహేను రోజుల్లో జింక పిల్లలా పరుగులుదీస్తాడు" అన్నాడు. ఆ మాటలు విన్నంతనే హఠాత్తుగా తలమీద పాము పడ్డట్టు ఆమె కంపించిపోయింది.

"స్వాముల వారికి విందు భోజనం పెట్టడానికే అప్పు చేయాల్సి వచ్చింది. బంగారం ఎక్కడ్నుంచి తేను? పంట బాగా పండి ఉంటే ఇబ్బంది ఉండేది కాదు. దిగుబడి తగ్గిపోయింది. తమ్ముడు సంవత్సరం రోజులుగా ఉద్యోగానికి వెళ్ళలేదు. పైగా వైద్యం ఖర్చులు. ఊడ అనుకొని పామును పట్టుకున్నానా ఏం?" అనుకొందామె.

ఆమె ఏదో చెప్పడానికి ప్రయత్నించింది. గొంతులో ఏదో అడ్డం పడినట్టనిపించింది. భయమా? తటపటాయింపా? ధైర్యం కూడగట్టుకొని "కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది స్వామీ! ఇక బంగారం

"ఎక్కడ్నుంచి తెచ్చేది" అంది. గురి తప్పిన బాణంలా ఉందామె.

తన పప్పులేమీ ఉడకవని స్వాముల వారికి బోధపడింది. షడ్రసోపేతమైన భోజనం లభించింది. అదే పదివేలు అనుకొని "నేనేం చేయగలను? పేదవాళ్ళు మోసపోకుండా వాళ్ళకొక దారి చూపించగలను. ప్రతిఫలం ఆశించకుండా సాయం చేయగలను. కానీ డబ్బు సమకూర్చలేనుకదా" అని చెప్పాడు. తిండి పెట్టిన ఇల్లాలి మనసు నొప్పించడం సమంజసం కాదనుకొన్నాడేమో "ఇదిగో దీన్ని రోజు మూడు పూటలు నోట్లో వేసుకొని చప్పరించి, మింగమని చెప్పు" అంటూ కొన్ని మూలికలు అందించాడు. "మన రోజులు బాగుంటే మట్టి సైతం మరణాన్ని అడ్డుకొంటుందంటారు" అంటూ జుట్టును సవరించుకుంటూ వెళ్ళిపోయాడు.

మంచంలో పడుకొని ఇదంతా గమనిస్తోన్న బికాస్ "కొంతమంది నమ్మక ద్రోహం చేస్తారు. ఇతడు భక్తి పేరిట మోసగించాడు. అతడికి విందు భోజనం పెట్టడానికి చేసిన ఖర్చుతో వారం రోజులు హాయిగా భోంచేయవచ్చు. పేదరికం తాలూకు నిస్సహాయత నుంచి ఎన్ని నమ్మకాలు అంకురిస్తాయి? ఈ నమ్మకాలు వీళ్ళను మరింత దుఃఖానికి గురిచేస్తున్నాయి. బీదరికం వారిని పిరికివాళ్ళను చేస్తోంది. మూఢవిశ్వాసాలను ప్రోది చేస్తుంది" అనుకున్నాడు మనసులో.

స్వాములవారి పుణ్యమాని గొడ్లు కూడా పస్తు ఉండిపోవాల్సి వచ్చింది. అసలు ఆమెకు వాటి గురించి ధ్యాసే లేకుండా పోయింది. అవి పసిపిల్లల్లా 'అమ్మా' అని పిలిచినప్పుడే ఆమెకు వాటి సంగతి జ్ఞప్తికి వచ్చింది. అవి దాహం తీర్చుకోవడానికి అనువుగా నీళ్ల పోసి ఉంచే తొట్టె ఖాళీగా ఉంది. పశువుల పిలుపు వినగానే ఆమె పుత్రవాత్సల్యంతో చలించినట్టు కదిలి వెళ్ళి వాటి కట్లను విప్పేసింది. ఆకలితోను, దప్పికతోనూ అవి నీటి తొట్టెకేసి పరుగెత్తాయి. ఖాళీ తొట్టెను చూసి, ఎప్పుడూ నీళ్ళు తాగే ఏటికేసి పరుగు లంఘించుకున్నాయి. లేగదూడ వెనుక కాళ్ళను పైకెత్తి మరీ పరుగెత్తసాగింది. అలా పశువులన్నీ ఏటిగట్టున గుమిగూడాయి.

ఏటి దాపుల ఉన్న పొదలలో ప్రతి చెట్టు మీదా వాలి గువ్వలు పురుగుల్ని పట్టుకొంటూ, ఎగురుతూ, మళ్ళీ వాలుతూ సందడి చేస్తున్నాయి. అడవి పూల వాసన ఆహ్లాదం కలిగిస్తోంది. కాస్త ముందొచ్చి గడ్డి మేసిన పశువులు చెట్ల నీడల్లో పడుకొని హాయిగా నెమరేసుకుంటున్నాయి. నీటిలో రకరకాల చేపలు కేరింతలు కొడుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయి. చేపల్ని తినడం కోసం పక్షులు నీటి మట్టానికి కొద్దిపాటి ఎత్తున ఎగురుతూ కళ్ళు పెద్దవి చేసుకొని, చేపల్ని గమనిస్తున్నాయి. గట్టున కూచుని గాలం వేసిన వాళ్ళు, తమ గాలానికి ఎర తగలదా అని ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. ఇవన్నీ జమునాకుమారిని నిలబడి ఆస్వాదించేలా చేయజాలని రోజువారీ పనులే! కొత్త విషయాలే కదా ఆసక్తి రేకెత్తిస్తాయి!

తన శ్రేయస్సు పట్ల అక్కయ్యకు ఎంత శ్రద్ధ! ఎంత ఆందోళన! బావ మాత్రం దేని గురించి పట్టించుకోనట్టు నడుచుకుంటున్నాడు. తను హిత బోధ చేస్తే, దానివల్ల ఏదైనా అపార్థం కలుగుతుందేమోనని భయపడుతున్నట్టుంది. ఓ మారు అక్కయ్యతో 'వాడు పెద్దవాడయ్యాడు. నువ్వు హితవు చెప్పమని అడుగుతున్నా, నేను చెప్పకపోవడానికి కారణం అతడు అపార్థం చేసుకుంటాడేమోననే! వాడు తెలివైన వాడు. పదిమందికీ సహాయం చేయాలన్న సదాశయం ఉన్నవాడు. మంచి చెడ్డల గురించి విచక్షణాజ్ఞానం కలిగి ఉన్నతంగా ఎదిగినవాడు. ఆడవాళ్ళు కలత చెందడం సహజమే – నువ్వు కలవర పడకుండా ఉండలేవు" అంటూ తాను ఇంట్లో లేననుకొని బావ చెప్పిన మాటల్ని గుర్తు చేసుకొన్నపుడల్లా ఏదో బాధ గుండెను మెలిపెడుతుంది.

"అక్కయ్యలాగానే గుండెలో తెగువా, స్వతంత్ర చింతనా లేకుండా బతుకుతోన్న కార్మికుల జీవితాల గురించి లోతుగా ఆలోచించాడు. తరతరాలుగా తాము స్వీకరించిన జీవన పథం నుంచి వైదొలగలేని కారణం వల్లా, భద్రతా రాహిత్యం వల్లా వేరొక మార్గాన్ని ఎంచుకోనివ్వక పోవడం వల్లా, మూఢత్వపు సరిహద్దులు దాటలేకపోతున్నారు. గొంగళి బతుకులోని క్రూరత్వం ప్రగతిశీల భావాలను హరించివేస్తోంది. దానిలోంచి తమను విముక్తుల్ని చేసుకోవడమంటే ఇన్నేళ్ళుగా విధివశాత్తు తాము అనుభవిస్తూ వచ్చిన బాధను అనుచితరీతిన మాయ చేయడమేగదా" అనుకొని వణికిపోయారు. మూర్ఖత్వం వల్లా పిరికితనం వల్లా ఏర్పడిన నమ్మకాలలోంచి వీళ్ళను విముక్తి చేయకుండా స్వర్గాన్ని అందించినా, మళ్ళీ తమ స్థితికే చేరుకొనేలా ఉన్నారు. తమ బానిసతనం గురించీ బాబాల గురించీ వాళ్లు లవలేశమైనా చింతించడం లేదు. మృత్యువు గురించి మాత్రమే చింతిస్తారు. మరణభయం తొలగిపోతే జీవితంలోని అక్రమాలను ప్రతిఘటించే చైతన్యం వచ్చేస్తుంది.

ఎక్కువ మంది ప్రజలు జీవితంలో భద్రతకే ప్రాధాన్యం ఇస్తారు. ప్రస్తుతం ఉన్నదాన్ని పోగొట్టుకోవడానికి వాళ్ళ మనసొప్పదు. అయితే ఒకపూట గంజికే వాళ్ళ స్తబ్ధ జీవితాల్లో చైతన్యం వస్తుంది. గతకాలపు నీడ, ప్రస్తుతం ఉన్న వెలుగుకన్నా శక్తివంతమైనది. అది తన పూర్వీకుల వంద సంవత్సరాల జీవనం. వాళ్ళ జీవితం సరికొత్త ఆలోచనల పేటిక. మానవుడు ఎప్పుడూ రాజమార్గాన్నే కోరుకుంటాడు. ఇలా ఏవేవో ఆలోచనల్లో మునిగి ఉండగా, కొంతమంది తన చెంతకు వస్తున్నట్టు అడుగుల సవ్వడి.

సూర్యుడు చీకటి గుహలోకి ప్రవేశిస్తున్నాడు. బికాస్ లేచి కూచున్నాడు. వచ్చిన వాళ్ళు తన సహకార్మికులు యువకులూ, మధ్య వయస్సులో తాను గాయపడ్డప్పుడు గానీ, యాజమాన్యానికెదురుగా న్యాయస్థానంలో వ్యాజ్యం వేసినప్పుడుగానీ ముందుకు రాకుండా పరోక్షంగా ప్రోత్సాహమూ, సహాయమూ చేశారు వాళ్ళు. లేచి నుంచుని సాదరంగా ఆహ్వానించాడు.

కుశల ప్రశ్నలయ్యాక చంచల్‌కుమార్ అసలు విషయాన్ని ప్రస్తావించాడు– "కేసు పూర్తయింది. నీకు మళ్ళీ ఉద్యోగం లభించింది. అన్నింటికంటే మిన్నగా, మనకు సంఘం పెట్టుకొనే హక్కు లభించింది. మన డబ్బులు ఖర్చయినా, ఈ సదుపాయాలు లభించాయి. కార్మికులు నీ నుంచి ఎంతో ఆశిస్తున్నారు. ఆ పులి మళ్ళీ పంజా విప్పే లోపల మన తూటా పేలాలి" అన్నాడు.

ఆకాశంలో చంద్రుడు ఉదయించాడు. వ్యథాభరిత జీవితాలను ఆర్ద్రంగా స్పృశిస్తున్నట్టు గుడిసెల మీదా, నేల మీదా చల్లని వెన్నెల ఊపిరి సలపని గనిలోపల ఉక్కిరి బిక్కిరి అయిపోయే కార్మికులకు వెన్నెల ఎంతో ఉల్లాసం కలిగిస్తోంది.

తోటి కార్మికులు హఠాత్తుగా చేసిన ప్రతిపాదన బికాస్‌కు ఆశ్చర్యం కలిగించింది. యాజమాన్యం బినామీ పేర్లతో డబ్బును కొల్లగొట్టినా, బికాస్‌కూ, దిలీప్‌కూ మళ్ళీ ఉద్యోగాలు రావడం, సంఘం పెట్టుకొనే హక్కు లభించడం వల్ల కార్మికుల మనసుల్లో ఆశ చిగురు తొడిగింది. దాని పర్యవసానంగానే ఈ ప్రతిపాదన.

చంచల్ కుమార్ మాటలు తనకు అర్థం కానట్టు నటిస్తూ, "మన డబ్బులన్నీ పోయాయి కదా, మళ్ళీ ఎందుకొచ్చిన గొడవ" అడిగాడు బికాస్.

అతడి కంఠధ్వనీ, ముఖ కవళికలూ అతడు నిజంగానే సంఘం కార్యకలాపాల నుంచి తప్పించుకోజూస్తున్నట్టు వున్నాయి. అది వాళ్ళ ఆంతర్యాన్ని గ్రహించడానికి వేసిన ఎత్తుగడ మాత్రమే.

(ఇంకావుంది)

కవిత్వమ్

మనో భ్రమణం

- కటుకోఝ్వల రమేష్

కొన్ని ఆలోచనలు...
కొన్ని ఆకాంక్షలు...
కొన్ని క్రియలు...
అన్నీ
ఈ జీవన సంద్రంలో
ఎక్కడో వొక్కడ
ఎదురు బొదురుగా
కలుస్తుంటాయి
వొక సామూహిక శక్తిగా
మనకు తెలియకుండానే
మనముందు
వో వారధిని కడతాయి
రా రమ్మంటూ స్వాగతం పలుకుతాయి

మనం వొక్కో ఇటుకను
లెక్కకట్టి
మెట్లు మెట్లుగా పేర్చి
వోపికల్ని కూడగట్టి
ఏ శిఖరమో ఎక్కాలనుకుంటాము
కానీ
ప్రవహించే జ్ఞాపకాలపై
ఎంతో అవలీలగా
అవతలి ఒడ్డుకు చేరుతాము
ఇక్కడేమో
వారధి ఇవతల
దేహం డొల్లలా మిగిలే వుంటుంది
ఖాళీ కాయాన్ని
కొన్ని వాక్కులు...
కొన్ని దృక్కులు...
కొన్ని చిక్కులు...
నిత్యం తొలుస్తుంటాయి
వొళ్లంతా వ్రణాలతో ముడుచుకుంటుంది
అక్కడ కొత్త ప్రపంచం
ఇంద్రధనస్సు
మనసుకు దర్శనమిస్తుంది
లాలిస్తుంది... బుజ్జగిస్తుంది
రంగుల స్వప్నాల్ని
మన మీద చిమ్మరిస్తుంది
ఊహలెన్నో చుట్టుముడతాయి
వేగంగా... దూరంగా పరుగిడతాము
దిగంతాల అంచుల వద్ద
భ్రమలన్నీ తొలగుతాయి
వొకే ఆలోచనతో...
వొకే ఆయుధంతో...
ఒకే ఆశయంతో...
మళ్లీ మన దేహాన్ని చేరుకుంటాము

అపస్వరం

ఏదో
ఒక అబద్ధాన్ని, బలవంతాన మార్చి
నా మనసును నమ్మించి
అడ్డుపెట్టుకొని, సాగిపోతూవున్నాను
అబద్ధాలు కూడా అప్పుడప్పుడు
ఊరటనిచ్చి, ఆత్మసంతృప్తికి దోహదపడ్తుంటాయి
ఎవరినీ ఇబ్బంది పెట్టని అబద్ధం
అందర్నీ సంతోష పరిచే యదార్థంలా
నన్ను, నాపరివారాన్ని కాపాడుతూ
సేవ చేస్తూ ఉంటుంది
నన్ను నేను తప్పుకుని
నాలోని అపాయకర బాంబును
వెలికితీసే ప్రయత్నంలో, నన్ను నేను
బహిర్గత పర్చుకుని, నా వాళ్లనూ
ఆందోళనకు గురి చేసి, అల్లకల్లోలపర్చి
మనశ్శాంతిని కొల్లగొట్టడం, ఎవరికి శ్రేయస్కరం?

అందుకే, నేను
కావాలనే ఓ అబద్ధాన్ని, ఒకే ఒక్క అబద్ధాన్ని, చిన్న అబద్ధాన్ని
నా జీవితంలో, మొట్టమొదటిసారిగా ఆహ్వానించాను
అదీ, ఒక కండిషన్‌పైనే!



- మహ్మద్ ఖాన్

ఓ అందమైన అబద్ధం
నన్ను రక్షించకపోవచ్చు, శాశ్వతంగా
తాత్కాలికంగా, నా బలహీనతను కాపాడి
నా వారిని, ఎంతో ఆహ్లాదంగా వుంచుతుంది, అది చాలు!
నేను, అబద్ధం చాటున నిలబడి
నిజాన్ని నాలో సమాధి చేశానన్న యదార్థం
ఎవరికి తెలుసు? నా స్వ విషయం, నా ఇష్టం!
అది, నాతోనే అంతం కావాలి, శాశ్వతంగానే!

తమాషాదా

వీకెండ్ వికృతాలు

- జె.లింగయ్య

పట్టువదలని విక్రమార్కుడు శవం కోసం చెట్టు దగ్గరకు వెళ్లాడు. చెట్టు మొత్తం వెదికినా శవం కనిపించలేదు. అడవంతా వెతికి నిరాశతో భాగ్యనగరం వైపు వెళ్లాడు. భాగ్యనగరం నడిబొడ్డున ఫ్లైఓవర్ పట్టుకుని వేళ్లాడుతున్న శవం కనిపించింది.

"హమ్మయ్య! నీకోసం...అడవితో పాటు భాగ్యనగరం అంతా వెతికాను కదా!" అంటూ శవాన్ని దింపి భుజాన వేసుకున్నాడు. అలా భాగ్యనగరం దాటుకుంటూ శ్మశానం వైపు నడవసాగాడు.

అమావాస్య...అర్ధరాత్రి...చిమ్మ చీకటి...కొంత దూరంలో అరుపులూ కేకలు... ఒకటే గోల! అదొక భూతాల మందిరంలా వుంది. లైట్లు మిణుగురు పురుగుల్లా వెలుగుతూ ఆరుతున్నాయి. ఆ మందిరం వైపు వెళ్లాడు. కానీ అది భూతాల మందిరం కాదు. పెద్ద బంగ్లా. ఆ బంగ్లా దగ్గర్లకు వెళ్లి కిటికీలో నుండి లోపలకు చూశాడు. అక్కడంతా అమ్మాయిలు, అబ్బాయిలు... చెవులు పగిలిపోయే శబ్దం, అసభ్యకరమైన భంగిమలో నృత్యం చేస్తున్నారు. ఆడవారో, మగవారో కూడా అర్థం కాని పరిస్థితి. ఒంటికి జానాబెత్తెడు పొడవున్న దుస్తులు ధరించి మద్యం సేవిస్తూ ఒళ్లు తెలీని స్థితిలో ఊగిపోతున్నారు.

విక్రమార్కుడికి ఏమీ అర్థం కాలేదు. అక్కడ చూసిన దృశ్యం గురించి ఆలోచించుకుంటూ శ్మశానం వైపు బయలుదేరాడు.

అప్పుడు శవంలోని బేతాళుడు, 'రాజా! ఈ తాగుడేమిటో? ఈ ఊగుడేమిటో? జానెడు జానెడు దుస్తులతో నృత్యాలు చేయడమేమిటో?" "నీకు అర్థం కావడం లేదు కదూ? నేను చెప్తాను శ్రద్ధగా విను. వీటినే క్లబ్బులు, పబ్బులు అంటారు. హైదరాబాదు నగరంలో పబ్బులు యమస్పీడుగా విస్తరించాయి. ఈ ఒక్క నగరంలోనే యాభైకి పైగా పబ్బులు, ముప్పైకి పైగా రిసార్టులు వెలిశాయి. ఇవి రాత్రి తొమ్మిది దాటింతర్వాత ప్రారంభమై అర్ధరాత్రి రెండు గంటల వరకు సాగుతాయి. వీటిలో న్యూడ్ డాన్స్... పోల్ డాన్స్... బెల్లీ డాన్స్.. టాప్‌లెస్ డాన్స్! మూడ్ స్వింగింగ్ మ్యూజిక్, కాక్‌టైల్స్ వంటి రకరకాల నృత్యాలు ఉంటాయి. ఆవేశమో! ఆనందమో! దీనికి అంతా ఊగుతారు. కైపెక్కించే డాన్సులు, బహిరంగ శృంగార చేష్టలు ఇక్కడ సర్వ సాధారణం. వీకెండ్ వచ్చిందంటే వేరే చెప్పక్కర్లేదు. అడుగుతీసి అడుగు వేయలేనంత జనంతో అవి కిటకిటలాడిపోతాయి. పబ్బులో రెండువందల మంది, రిసార్టులో నాలుగు వందల మందికి తగ్గకుండా కస్టమర్లు వస్తారు. వీకెండ్ పేరుతో యువతీ యువకుల వికృత చేష్టలు కుప్పలు తెప్పలు. వీకెండ్‌కు ముందే వీరు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఆరోజు నగరంలో ఉన్న అన్ని పబ్బుల్లో యువతీ యువకులు కిటకిటలాడతారు. పబ్బుల్లోనే ఇంత ఘోరంగా ఉంటే, రిసార్టుల్లో ఏమి జరుగుతుందో ఎవ్వరికీ తెలియదు. ఊరికి దూరంగా శివారు ప్రాంతంలో ఉండే రిసార్టుల్లో కవర్ చార్జీలు ఐదువందల నుండి ఐదు వేల రూపాయల వరకు వుంటాయి. రూమ్ చార్జీలు వేలల్లో ఉంటే, కపుల్ ఎంట్రీ పేరిట కండిషన్ పెట్టి డబ్బు వెదజల్లితే చాలు రెడీమేడ్‌గా అమ్మాయి అందుబాటులోకి వస్తుంది. ఇటీవలి కాలంలో కాల్‌గరల్స్ టెంపరరీ కంపెనీలుగా మారిపోతున్నారు. ఈ పార్టీలకు హాజరయ్యేది ఎక్కువగా ఐటి, బిపిఓ రంగాలకు చెందినవారే. అధిక వేతనాలు పొందే కార్పొరేట్ వర్గానికి చెందిన సంపన్న వర్గాల పిల్లలు, పేజ్‌త్రీ సెలబ్రెటీలు, క్రీడాకారులు వచ్చారంటే చాలు, పబ్బుల నిర్వాహకులు పోటీలు పడి వారిని ఆహ్వానిస్తారు. మోస్ట్ ఓపెనింగ్ సెంటర్లుగా తమ పబ్బులను చిత్రీకరించి కస్టమర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు.

పబ్బుల్లో అడుగుపెడితే చాలు రెండువేల నుండి పదివేల రూపాయల వరకు వదిలించుకోవాల్సిందే. ఇలాంటి క్లబ్బులు, పబ్బులు, నైట్ పార్టీల వల్ల మన సంస్కృతి విధ్వంసానికి దారి తీస్తోంది. దీనివల్ల కొంతమంది యువతీ యువకులు డ్రగ్స్‌కు, దొంగతనాలకు, హత్యలకు, అత్యాచారాలకు పాల్పడుతూ, మన సంస్కృతీ కట్టుబాట్లను విదేశీ విష సంస్కృతిలో విలీనం చేస్తున్నారు..

రాజా! నేను చెప్పిందంతా శ్రద్ధగా విన్నావుగా! నాకు కొన్ని సందేహాలు ఉన్నాయి. ఇలాంటి క్లబ్బులు, పబ్బులు విచ్చలవిడిగా విస్తరించడానికి కారణం ఏమిటి? ఇలాంటి సంస్కృతిని అరికట్టాలంటే ఏం చేయాలి? తెలిస్తే చెప్పు. తెలిసికూడా చెప్పకపోయావో.. నీ తల వెయ్యి చెక్కలవుతుంది" అని ముగించాడు బేతాళుడు.

అప్పుడు విక్రమార్కుడు ఇలా చెప్పసాగాడు. "బేతాళా! పబ్బులు విస్తృతంగా విస్తరించడానికి కారణం 'సాఫ్ట్‌వేర్ అంటించిన వైరస్'. సాఫ్ట్‌వేర్ కంపెనీలతోపాటే పబ్బుల సంఖ్య పెరిగింది. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో నాలుగు అంకెలకు మించి వేతనాలు ఇవ్వడం, విదేశీయులు మన దేశానికి వచ్చి వారి దేశం నుండి తెచ్చిన విష సంస్కృతి ఇక్కడ వదిలిపోవడంతో దాన్ని మనం గుడ్డిగా అనుసరిస్తున్నాం. దానికి తోడు పాశ్చాత్య సంస్కృతి మర్రి ఊడలా పెరిగిపోతోంది. ఏ టీవీ ఛానల్ చూసినా ఫ్యాషన్ షోలాంటి కార్యక్రమాలు ప్రచారం చేస్తున్నాయి. ఇటీవలి సినిమాల్లో అసభ్యకరమైన సన్నివేశాలు, ఒక గురువును విద్యార్థి టీజ్ చేయడం, ఉల్లిపొరంత పల్చటి చీర కట్టిన లేడీ లెక్చరర్‌ను విద్యార్థులు కామెంట్ చేయడం, ఆ లేడీ లెక్చరర్‌కే స్టూడెంట్ సైట్ కొట్టడం, స్టెప్పులేయడం చూస్తున్నాం. ఇలాంటి సంస్కృతిని అరికట్టాలంటే మన సంస్కృతీ సాంప్రదాయ పద్ధతులను కాపాడుకొనేందుకు అన్ని పార్టీలు ముక్త కంఠంతో శాసన సభలో తీర్మానం ప్రవేశపెట్టి, చర్చించాలి. దీనికి తోడు చదువుకున్న యువతీ యువకులు ఇలాంటి విష సంస్కృతిపై ఉద్యమించాలి" అన్నాడు.

"బాగా చెప్పావు విక్రమార్కా! మళ్లీ కలుస్తాను" అంటూ బేతాళుడు శవంతో సహా మాయమయ్యాడు.

★

పొడుపు కథ విప్పతారా

1. ఏమి లేనమ్మ ఎగిరెగిరి పడ్తుంది, అన్నీ ఉన్నమ్మ అణగి మణగి ఉంటుంది.

2. ఏడడుగుల చెట్టును ఎక్కనూ లేము, దిగమూ లేము.

3. ఏటి ఇసుకను ఎంచలేము, తాటి మానును తన్నలేము, ఈత మానును విరచలేము. ఏంటవి?

4. ఆకులేని తీగ అరవై ఆమడ సాగు. ఏంటబ్బా అది?

5. ఆకుల్లేని అడవిలో జీవం లేని జంతువు, జీవం గల జంతువును వేటాడింది. ఏంటో మరి?

6. ఆకుల్లేని పంట, అరవైయ్యారు పుట్లు. చెప్పకోండి.

7. ఆ కొండకు ఈ కొండకు ఇనుప సంకెళ్ళు. కనిపెట్టండి.

8. ఆకాశాన చుక్క, చుక్క కింద తోక. చుక్కెవరు? తోకెవరు?

టొమాటో పండా? కాయా?





వెతికేది దేని కోసమో...

నేస్తాలూ!ఇతనో గొప్ప ప్రొఫెసర్. ఈయనకు కొద్దిగా మతి మరుపు ఉంది. చూడ్డానికి దేనికోసమో వెతుకుతున్నట్టు ఉంది కదూ. నిజమే. ఈయన కొన్ని వస్తువుల కోసం వెతుకుతున్నారు. మీకు కనిపిస్తే చెప్పండే. మీకు క్లూ కూడా ఇస్తున్నాం. ఆయన పోగొట్టుకున్న వస్తువులు ఆ టేబుల్ పైన, పక్కనున్న కబోర్ట్‌లో ఉన్నాయి.

సిటీలను కనిపెడదాం!

పిడుగులూ... ఈ అక్షర సమూహంలో కొన్ని సిటీల పేర్లు దాగున్నాయి. వాటిని కనిపెట్టి సున్నా చుట్టండి. ఇంతకీ అవేంటంటే...
colombo,copenhagen, canberra, cairo, montevideo, nairobi,kiev, tehran, prague

C	J	P	R	A	G	U	E	V	M
O	A	M	M	L	C	A	I	R	O
P	H	N	O	M	P	E	N	H	N
E	O	X	B	Z	U	H	M	Q	T
N	A	R	H	E	T	F	G	L	E
H	W	E	Y	P	R	K	I	E	V
A	B	T	N	A	I	R	O	B	I
G	S	D	C	A	L	M	A	B	D
E	H	O	I	Q	Z	X	Y	P	E
N	X	J	C	O	L	O	M	B	O



ఏది ముందో...

హాయ్ ఫ్రెండ్స్... ఇక్కడ మొత్తం 8 ఐస్ క్రీం పుల్లలు ఉన్నాయి.వాటిని ఎలా పడితే అలా పడేశారు. వీటిలో పైనుండి కిందకు వరుసగా అంకెలు వేయండి. అన్నింటికంటే పైన ఉన్న దానికి 1, తర్వాతి దానికి 2... ఇలా అన్నమాట



సాయం చేద్దాం

నేస్తాలూ... పైన ఉన్న నలుగురు కూడా మన నేస్తాలే. వాళ్లు సరదాగా ఆడదామని ఓ కాయిన్‌కి దారం కట్టి ఆడుతున్నారు. కానీ ఆట మధ్యలో అందరి దారాలు కలిసి చిక్కుబడిపోయాయి. ఇప్పుడేమో ఏది ఎవరిదో తెలియడం లేదట. మనం కొంచెం సాయపడితే వాళ్లు త్వరగా ఆ చిక్కుముడులను తీసుకుని ఎవరి కాయిన్ వాళ్లు తీసుకుంటారు. మరింకెందుకాల్యం.

పేర్లు రాసేద్దాం

హాయ్ పిడుగులూ! ఇక్కడ కొన్ని బొమ్మలున్నాయి. వాటి పేర్లని అక్కడే ఉన్న గళ్లలో రాయండి. అసలు ముందుగానే కొన్ని అక్షరాలు రాసేశారు కూడా. వాటి ఆధారంగా మిగిలిన గళ్లలో ఆ వస్తువుల పేర్లను మీరు రాసేయండి.



పదమేంటో!

చిన్నారులూ... ఇక్కడ తేనె పట్టుని చూస్తుంటే వెంటనే తాగేయాలనిపిస్తుంది కదూ. అయితే ఆ పని తర్వాత చేద్దాంకానీ ముందు తేనెపట్టుని ఏమంటారో చెప్పండి. ఆ తేనె పట్టు పైనే కొన్ని ఆంగ్ల అక్షరాలు కూడా వున్నాయి. ఆ అక్షరాలతోనే మీరు ఆ పదాన్ని రాయెుచ్చు.

జవాబులు

వెతికేది దేనికోసమో...:
టిఫిన్ ప్లేట్ కిందున్న కళ్లజోడు, టీ కప్పులో ఉన్న పెన్ను, కబోర్డ్‌లో ఉన్న పుస్తకం.

పేర్లు రాసేద్దాం:
palm,precise, rife, toga, spear, tools, satin, pets, pleat,slog, grin, start, nails.

పదమేంటో!:
HONEYCOMB

ఏది ముందో...



సాయం చేద్దాం :
1- B, 2-D, 3-A, 4-C.

పొడుపు కథలు..:
1. విస్తరి 2. మొక్కజొన్న 3.నక్షత్రాలు, ఆకాశం, సూర్యుడు 4. కరెంటు తీగలు 5. దువ్వెన 6. ఉప్పు 7. నల్ల చీమల బారు 6. గాలిపటం

అట్టమీది కథ

మాయమైన పాప్ మాంత్రికుడు

ప్రేక్షకులను ఉర్రూతలూగించే పాప్ సంగీతానికి, నృత్యానికి రూపం వస్తే ఎలా వుంటుంది? అచ్చుపోసినట్టు మైఖేల్ జాక్సన్ లాగానా! ప్రపంచవ్యాప్తంగా వున్న కోట్లాది పాప్ అభిమానులలో ఏ ఒక్కరినడిగినా బహుశా ఈ మాటే చెప్తారేమో!! పాప్ మాంత్రికుడు మైఖేల్ ఆట, పాట ప్రేక్షకుల హృదయాలను అంతగా ఆకట్టుకుంది మరి. ఒకటా రెండా...నాలుగు దశాబ్దాలపాటు అంతర్జాతీయ సంగీతరంగంలో పాప్ సరిగమలు పలికించాడు. తన ఆట, పాటతో ప్రేక్షకులను సమ్మోహితులను చేశాడు. ఐదేళ్ల పసి వయసులో అమాయకంగా పాప్‌రంగంలో అడుగెట్టి అనతికాలంలోనే పాప్ సూపర్‌స్టార్ అయ్యాడు. తనతోపాటే ప్రేక్షకులను ఆడించాడు. పాడించాడు. మత్తెక్కించాడు. ఊగించాడు. వెర్రెత్తించాడు. కానీ .... అయిదు పదుల వయసులోనే అశేష ప్రేక్షకావళిని వీడి... మృత్యువుతో కలిసి స్టెప్పులేస్తూ, పాప్ పాట ఆలపిస్తూ వెళ్లిపోయాడు. అతనికోసం ఓ చిన్ని కన్నీటిబొట్టు ఈ అట్టమీది కథ.

- కె. అంజన

ఆగస్టు 29, 1958లో జోసఫ్ జాక్సన్, కాథరిన్ జాక్సన్ దంపతులకు ఓ బాబు పుట్టాడు. ఈ చిన్నారి వారికి కలిగిన ఏడవ సంతానం. నేరేడు పండులా నిగనిగలాడే శరీరం, గిరజాల జుట్టు, ఇంతలేసి కళ్లు ... ముద్దులొలికే ఆ నల్లపిల్లవాడే భవిష్యత్తులో పాప్ ప్రపంచాన్ని శాసిస్తాడని ఒక ఊపు ఊపుతాడని, వెర్రెత్తిస్తాడని, ఎవరూ ఊహించలా. అతనే పాప్ మాంత్రికుడు మైఖేల్ జాక్సన్. నిండా ఐదేళ్ల వయసులోనే కెరీర్ ప్రారంభించాడు. అమాయకంగా వేసిన ఆ పసిఅడుగులు, ముద్దుముద్దుగా పాడిన పాటలు పాప్ ప్రపంచ ప్రస్థానానికి తొలిమెట్లవుతాయని ఎవరూ అనుకోలేదు. జాక్సన్ తండ్రి స్టీలు మిల్లులో పనిచేసేవాడు. ఆయనకూడా అప్పుడప్పుడూ తన సోదరుడితో కలిసి సొంత బ్యాండ్‌లో పాడేవాడు. ఎంతోకొంత సంపాదించేవాడు. తన ఐదుగురు పిల్లలతో కలిసి 'జాక్సన్ 5' బ్యాండ్‌ను ఏర్పాటు చేశాడు. రిహార్సల్స్ చేసేటప్పుడు చిన్న పొరపాటు జరిగినా ఏమాత్రం ఉపేక్షించక పిల్లలను దండించేవాడు. చిన్నారి మైఖేల్ తరచూ తండ్రి కోపాగ్నికి గురయ్యేవాడు. దాంతో నాన్న అంటేనే భయం. వణుకు. ఆ దండన ఒక్కోసారి శృతిమించేది కూడా. తన పిల్లలు రాత్రుళ్లు నిద్రకు ఉపక్రమించేముందు గది కిటికీలు వేసుకోకపోవడం కూడా ఆయనకు నచ్చేదికాదు. తప్పనిసరిగా కిటికీలు వేసుకోవాలన్న విషయం వారికి మర్చిపోలేని విధంగా చెప్పేందుకు ఓ వింత ప్రయత్నం చేశాడు. ఓ రోజు మొహానికి వికృతమైన మాస్క్ ఒకటి తగిలించుకొని కిటికీలోంచి లోపలికొచ్చి అరచి, గొంతి గోల చేసి భయపెట్టాడు. గదిలో నిద్రిస్తున్న బుజ్జి మైఖేల్ ఆ సంఘటనతో భయపడిపోయాడు. ఆ తర్వాత ఎన్నో సంవత్సరాలపాటు పిచ్చి పిచ్చి కలలు వెంటాడేవి. వాటినుంచి ఆ చిన్నారికి ఊరటనిచ్చింది, సేదతీర్చింది సంగీతమే. క్లాసులో తోటి విద్యార్థుల ముందు మయూరంలా ఆడేవాడు. కోకిలలా పాడేవాడు. క్రిస్టమస్ ఉత్సవాలను, స్నేహితుల పుట్టినరోజులను అస్సలు వదిలేవాడు కాదు. తన ఆట, పాటతో వారిని ఉత్సాహపరిచేవాడు. చుట్టుపక్క ప్రాంతాలలో నల్లవారి క్లబ్బుల్లోను, ఉత్సవాల్లోను ప్రదర్శనలిచ్చేవాడు. తొమ్మిదేళ్ల వయసులోనే ఆటపాటతో అత్యద్భుతమైన ప్రతిభను కనబరిచాడు మైఖేల్ జాక్సన్. 'జాక్సన్ 5' బ్యాండ్‌లో అతనే పిన్నవయస్కుడు. పాట వింటే పసివాడు పాడినట్టున్నా డాన్స్ మాత్రం మంచి అనుభవజ్ఞుడు చేసినట్టుండేది. పైగా తన ఆటకు పాటకు అనుగుణంగా కట్టే సొంత బాణీలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకునేవి. ఆ చిన్నవాడు ప్రపంచంలోనే నెంబర్ 1 పాప్ స్టార్‌గా ఎదిగాడు.

ఆ పది ఆల్బమ్‌లు...

మిలటరీ తరహా కోటు, చలువ కళ్లద్దాలు, చేతి తొడుగు, టోపీ పెట్టుకొని మైఖేల్ వేదిక మీదకొచ్చాడూ అంటే ఉరుములే. మెరుపులే. శరీరాన్ని నాగుపాములా మెలికలు తిప్పుతూ,

రబ్బరుబంతిలా చుట్టేస్తూ... ఉచ్ఛస్వరంతో పాడితే ప్రేక్షకులు ఊగిపోవాల్సిందే. వంగి వందనాలు పలకాల్సిందే. అటువంటి మైఖేల్ తన నలభై ఐదేళ్ల కెరీర్‌లో అద్భుతమైన ఆల్బమ్‌లు పది రూపొందించాడు. అందుకోసం అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని చక్కగా ఉపయోగించుకున్నాడు.

పధ్నాలుగేళ్ల ప్రాయంలో సోలో సింగర్‌గా మైఖేల్ తొలి ఆల్బమ్‌ను రూపొందించాడు. 1972లో చేసిన 'గాట్ టు బి దేర్'ను మోటౌన్ విడుదల చేసింది. అదే సంవత్సరం చేసిన 'బెన్' పూర్తిస్థాయి సోలో సింగర్‌గా అతను చేసిన రెండవ ఆల్బమ్. ఇది మిలియన్ల కొద్దీ అభిమానుల ఆదరణ పొందింది. మూడవ ఆల్బమ్ 'మ్యూజిక్ అండ్ మి' (1973). కౌమారంలో ప్రకృతిసహజంగా మార్పు చెందుతోన్న స్వరంతో మైఖేల్ ఈ ఆల్బమ్ చేశాడు. 'జాక్సన్ 5'తో మోటౌన్ చేసిన చివరి ఆల్బమ్ 'ఫరెవర్, మైఖేల్' (1975). ఈ సోలో ఆల్బమ్‌తోనే మైఖేల్ పాప్ సంగీత ప్రధాన స్రవంతిలో కలిశాడు. అతను చేసిన ఆరవ ఆల్బమ్ 'థ్రిల్లర్' (1982). ఇది ఆల్బమ్ అమ్మకాలలోనే రికార్డులు సృష్టించింది. అంతేకాక మైఖేల్ ఒక్కసారిగా పాప్ సూపర్‌స్టార్ అయిపోయాడు. టీవీ చానళ్లలో మ్యూజిక్ వీడియోలకు తెరతీసింది ఈ ఆల్బమే. దీని ద్వారా అతను పరిచయం చేసిన 'మూన్‌వాక్' డాన్స్‌ను అభిమానులు ఎప్పటికీ మరువలేరు. ఆ తర్వాత ఐదేళ్లకు 1987లో రూపొందించిన ఆల్బమ్ 'బ్యాడ్'. ప్రపంచవ్యాప్తంగా 30 మిలియన్ల కాపీలు అమ్ముడయ్యాయి. 1991లో విడుదలైన 'డేంజరస్' ఆల్బమ్ ఏకంగా పాప్ సంగీత ప్రపంచంలోనే ఒక సంచలనం సృష్టించింది. జాతి వివక్షను దునుమాడుతూ పాడిన 'బ్లాక్ అండ్ వైట్' విన్నవారికెవరికైనా కళ్లు చెమ్మగిల్లాల్సిందే. యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ఆలపించిన 'హీల్ ది వరల్డ్' వింటే యుద్ధోన్మాదులు సైతం పునరాలోచనలో పడాల్సిందే. 1995లో 'హిస్టరీ', 2001లో 'ఇన్‌విన్సిబుల్' విడుదలై మిలియన్ల కొద్దీ కాపీలు అమ్ముడయ్యాయి. మొత్తంమీద ప్రపంచ వ్యాప్తంగా మైఖేల్ ఆల్బమ్‌లు 750 మిలియన్ల కాపీలు అమ్ముడయ్యాయని ఒక అంచనా.

ఎన్నో అవార్డులు...

సోలో కళాకారుడుగా మైఖేల్ సాధించిన ప్రపంచ ఖ్యాతి మాటలకు అందదు. అక్షరాలకు చిక్కదు. తనకు ముందు పాప్ సామ్రాజ్యాన్ని ఏలుతున్న హెల్విన్ క్రిస్లీ, ది బీటింగ్స్ అండ్ ఫ్రాంక్ స్విత్రా సూపర్‌స్టార్‌డమ్‌ను మైఖేల్ అనతి కాలంలోనే సాధించాడు. కేవలం గాయకుడిగానే కాక గీత రచయితగా, డాన్సర్‌గా ప్రపంచప్రఖ్యాతిగాంచిన కళాకారుడుగా ప్రేక్షక హృదయాలపై జాక్సన్ చెరగని ముద్రవేశాడు. అంతేకాదు మంచి టీమ్‌లీడర్ కూడా. ఇందుకు ఆయన విడుదల చేసిన వేలాది రికార్డులు, అందుకున్న అవార్డులే సాక్ష్యం. పాటనే ఊపిరిగా, ఆటనే ఆహారంగా బ్రతికిన మైఖేల్‌ను వరించిన అవార్డులు, రివార్డులు ఎన్నో...ఎన్నెన్నో. ప్రతిష్టాత్మకమైన 13 గ్రామీ అవార్డులు అందుకున్నాడు. పలుసార్లు గిన్నిస్ ప్రపంచ రికార్డులు సృష్టించాడు. ఇవికాక 197 ప్రధాన అవార్డులను సొంతం చేసుకున్నాడు.

విషాదాలు..వివాదాలు...

పాప్‌స్టార్‌గా విశ్వవ్యాప్తంగా సంగీతాభిమానుల మనసుల్ని లెక్కలేనన్నిసార్లు దోచుకున్న మైఖేల్‌ను విషాదాలు, వివాదాలు వెన్నంటే వుండేవి. 1980వ దశకంలో కెరీర్‌పరంగా అత్యున్నత స్థాయికి చేరుకున్నా... 1993 నుంచి దిగజారసాగింది. లైంగిక ఆరోపణలు చుట్టుముట్టాయి. పదమూడేళ్ల పిల్లవాడిపై అత్యాచారం జరిపాడని ప్రచారం జరిగింది. సాక్ష్యాలు లేక అవన్నీ న్యాయస్థానంలో వీగిపోయినా మైఖేల్ మీద పడ్డ ఆ మచ్చ మాత్రం అలాగే మిగిలిపోయింది. అందుకోసం అతను కొన్ని మిలియన్ల డాలర్లనే ఖర్చు చేయాల్సి వచ్చింది. ఒకసారి తన చిన్న కుమారుడ్ని ఓ హోటల్ బాల్కనీలో పట్టుకొని వేళ్లాడదీసి చూపించడం కూడా వివాదాస్పదమైంది. 1993 నాటికి ఆరోగ్యం క్షీణించడం, కోర్టు కేసులు వెన్నాడడం, మానసిక వత్తిళ్లు వేధించడంతో మాదక ద్రవ్యాలకు బానిసయ్యాడు. తన శరీరం రంగును నలుపు నుంచి తెలుపుకు మార్చుకోవడానికి, ముక్కును సన్నబరుచుకోవడానికి అనేక సార్లు ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకోవడం, గడ్డం...కనుబొమల తీరు మార్పించుకోవడం కూడా ఆరోగ్య సమస్యలకు దారితీసింది. మొహం చతురస్రాకారంలోకి మారిపోయింది. చిట్టచివరి రోజుల్లో అయితే ముక్కు కింద ప్లాస్టర్ వేస్తే తప్ప నిలబడని పరిస్థితి ఏర్పడింది. వీటికి తోడు ఛాతీ నొప్పి, వెన్ను నొప్పి...ఒకటా రెండా ఆరోగ్య సమస్యలెన్నో. రోగాలతో అతని శరీరం అంతా పుచ్చిపోయింది. కోర్టు కేసులతో, మీడియా దాడులతో మనసు గాయపడింది. ఆ నొప్పులనుంచి బయటపడడానికి

వ్యక్తి'గతం'

పూర్తి పేరు: మైఖేల్ జోసఫ్ జాక్సన్

పుట్టిన తేదీ: ఆగస్టు 29, 1958

పుట్టిన ప్రాంతం: గేరీ, ఇండియానా (అమెరికా)

ముద్దు పేర్లు: మైక్, ఎం.జె, డూడూ, మైకీ, స్మెల్లీ

వృత్తి: గాయకుడు

ఎత్తు: 5 '10'

తల్లిదండ్రులు: కాథరిన్ జాక్సన్, జోసఫ్ వాల్టర్ జాక్సన్

తోబుట్టువులు: 8 మంది

మాజీ భార్యలు: లీసా మేరీ ప్రెస్లీ, డెబోరా (డెబ్బీ) రో

పిల్లలు: ప్రిన్స్ మైఖేల్ జాక్సన్ జూనియర్, పారిస్ మైఖేల్ కాథరిన్, ప్రిన్స్ మైఖేల్ జూనియర్ 2

హాబీలు: తన పిల్లలు, స్నేహితులు, పెంపుడు జంతువులతో గడపడం, వీడియో గేమ్స్ ఆడడం, సంగీతం వినడం, సినిమాలు చూడడం

ఇష్టమైన పాట: క్లాడ్ డిబస్సీ పాడిన 'ఆఫ్టర్‌నూన్ ఆఫ్ ఎ ఫాన్'

తన పాటల్లో ఇష్టమైనవి: ఎర్త్ సాంగ్, హీల్ ది వరల్డ్, స్పీచ్‌లెస్, ది లాస్ట్ చిల్డ్రన్, యు ఆర్ మై లైఫ్

ఇష్టమైన ఆహారం: పళ్లు, కూరగాయలు, మెక్సికన్ ఫుడ్

ఇష్టమైన ద్రవం: పళ్ల రసాలు

ఇష్టమైన అంకె: 7


తల్లి, సోదరుడితో మైఖేల్


రెండవ భార్య డెబ్బీతో...


మొదటి భార్య లీసాతో...



మైఖేల్ పిల్లలు



రెండవ కుమారుడితో



పెద్ద కుమారుడితో

తరచూ పెయిన్‌కిల్లర్ల వాడకానికి అలవాటు పడ్డాడు. ఓ దశలో మత్తు పదార్థాలకు కూడా బానిసయ్యాడు. అతని జీవన శైలి, వినూత్న విడ్డూర పోకడలు, నిరంతరం ఏదో ఒక కొత్త మార్పుతో కనిపించాలనుకునే ధోరణి కూడా సమస్యలకు మూలమైంది. చిట్టచివరకు అప్పులపాలయ్యాడు. ఒకప్పుడు 2700 ఎకరాల్లో నివసించిన మైఖేల్ అప్పుల ఊబిలో కూరుకుని అద్దె ఇంటికి మారాడు. అక్కడే అంతిమ క్షణాలు గడిపాడు.

గుప్తదానాలు...

మైఖేల్ ఆటపాటతో మిలియన్లకొద్దీ డాలర్లను సంపాదించినప్పటికీ బాల్యంలో తను అనుభవించిన పేదరికాన్ని మాత్రం మరువలేదు. తన సంపాదనలో కొంత భాగాన్ని పేదలకోసం కేటాయించేవాడు. అనాథ పిల్లలకోసం 1992లో 'హీల్ ది వరల్డ్' ఫౌండేషన్‌ను స్థాపించాడు. హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులకూ సాయం అందించాడు. వీధి బాలలు ఆడుకోవడానికి ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌ను, జంతువులకోసం జూపార్క్‌ను ఏర్పాటుచేశాడు. 39 ఛారిటీలకు ఆర్థికసాయం చేసినందుకుగాను గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకున్నాడంటేనే అతని దాతృత్వాన్ని అర్థంచేసుకోవచ్చు. అంతేకాదు ఆత్మహత్య చేసుకోబోయిన ఎందరినో కాపాడి మానవత్వాన్ని చాటుకున్నాడు.

అచ్చిరాని పెళ్లిళ్లు....

కొంతమందికి కొన్ని అచ్చిరావేమో! మైఖేల్ వైవాహిక జీవితానికి ఇది వర్తిస్తుందనుకుంటా!! రెండు సార్లు ప్రేమించి మరీ పెళ్లాడినా వారితో ఎక్కువకాలం కలిసి జీవించలేకపోయాడు. పాప్‌స్టార్ ఎల్విస్ ప్రీస్లీ కుమార్తె, గాయకురాలు, పాటల రచయిత లిసా ప్రీస్లీని 1994 మే మాసంలో వివాహమాడాడు. బాలుడిపై అత్యాచారం జరిపినట్టు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అతనికి మానసిక స్థైర్యాన్నిచ్చి వెంట నిలిచిందామె. మాదకద్రవ్యాల వ్యసనం నుంచి మైఖేల్ బయటపడేందుకు ఎంతగానో సాయం చేసింది. కష్టసమయాల్లో వెన్నంటి నిలిచి ఓదార్చిన ఆమెకు వివాహ బంధంతో మరింత దగ్గర కావాలనుకున్నాడు. ఓరోజు ఫోన్ చేసి అదే విషయాన్ని ప్రస్తావించాడు. ఆమె కూడా అంగీకరించింది. అలా స్నేహం ప్రేమగా మారి వైవాహిక బంధానికి దారిచూపింది. కానీ మీడియా మాత్రం ... తన మీద వచ్చిన లైంగిక ఆరోపణలనుంచి బయటపడేందుకే మైఖేల్ ఈ వివాహం చేసుకున్నాడని గోలపెట్టింది. ఏదేమైతేనేం వారిరువురూ ఎక్కువకాలం కలిసి జీవించలేకపోయారు. రెండేళ్లకే (1996) విడాకులు తీసుకున్నారు. అయితే అదే సంవత్సరం మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నప్పుడు అతనికి ఆత్మీయంగా సేవచేసిన నర్సు డెబ్బి రో ను రెండవసారి తనజీవితంలోకి ఆహ్వానించాడు మైఖేల్. వీరికి ప్రిన్స్ మైఖేల్ జాక్సన్ 1, పారిస్ మైఖేల్ క్యాథరిన్ జన్మించారు. అయితే వీరి మధ్య కూడా సఖ్యత కుదరక 1999లో విడాకులు తీసుకున్నారు. పిల్లలు మాత్రం మైఖేల్ దగ్గరే వున్నారు. సరొగేట్ మదర్ ద్వారా మైఖేల్ మరో బిడ్డకు తండ్రయ్యాడు.

కొడుకుతో కలిసి ఆడి పాడాలని...

అన్నీ అనుకున్నట్టు జరిగితే ... జులైలో లండన్లో తన కొడుకుతో కలిసి ఆడి పాడే మైఖేల్‌ను చూసేవాళ్లం. తండ్రీ కొడుకులిద్దర్నీ ఒకే వేదికపై చూసిన ఆనందడోలికల్లో తేలిపోయేవారమే. పన్నెండేళ్ల ప్రిన్స్ మైఖేల్ జాక్సన్ ను సంగీత ప్రపంచానికి ఎలా పరిచయం చేస్తే బావుంటుందా అని ఆలోచించి మరీ ఈ నిర్ణయం తీసుకున్నాడు. విశ్వవ్యాప్తంగా వున్న మిలియన్లకొద్దీ అభిమానులు తనవూ మనసూ మరిచిపోయి ఆ అద్భుత విన్యాసాన్ని, విందును ఆరగించడాన్ని, మృత్యువు చూడాలనుకోలేదు. అందుకే అర్థంతరంగా మైఖేల్‌ని తీసుకెళ్లిపోయింది. బహుశా ఈ పాటికే పాప్ మాంత్రికుడు మైఖేల్ మృత్యువుకు కూడా ఆటాపాటా నేర్పించేసి వుంటాడు.

విషాదాంతం

మైఖేల్ జాక్సన్ గొప్ప కళాకారుడు. అంతర్జాతీయ పాప్‌స్టార్. అంతేకాదు! ఆర్థికాభివృద్ధి పేరుతో మన గొంతు చుట్టూ బిగించబడుతున్న వినియోగ సంస్కృతిలో భాగమే ఆయన. పాప్ రంగంలో రాణించడానికి, ప్రపంచ ప్రేక్షకులు తనను స్వీకరించడానికి అనుగుణంగా తన శరీరాన్ని మలుచుకున్నాడు. భారీ మొత్తం వెచ్చించి అత్యంత బాధాకరమైన ప్లాస్టిక్ సర్జరీ చేయించుకొని మరీ చర్మం రంగు మార్చుకున్నాడు. ముక్కు సరిచేయించుకున్నాడు. జన్మత: వచ్చిన బిరుసైన జుత్తును సైతం మృదువుగా మార్చుకోవడానికి ప్రయత్నించాడు. తన నల్లజాతి గతాన్ని మరుగున పరచడానికే జాక్సన్ ఇన్ని తంటాలు పడ్డాడు. పాశ్చాత్య సంగీత ప్రపంచంలో చలామణీ అయ్యేందుకు అంగీకృతమైన రీతిలో తనను తాను మార్చుకోడానికి చేసిన ప్రయత్నమే ఇదంతా. చుట్టూ వున్న వాతావరణం అతనిపై ఎలాంటి ఒత్తిళ్లు కలుగచేశాయో దీన్నిబట్టే తెలుస్తోంది. నల్లజాతి గుండె చప్పుడుగా మొదలై శ్వేతజాతి సాంస్కృతిక ప్రతీకగా మారిపోవడం వెనక పెద్ద సామాజిక సందేశమే వుంది. చివరి దశలో ఆయన ఎదుర్కొన్న సమస్యలూ, సంక్షోభాలూ కూడా కళారంగంలో చొరబడిన కాలుష్యాన్ని పట్టి చూపిస్తాయి. ఇంపోర్టెడ్ గ్లామర్ ఆకర్షణకు ఎల్లప్పుడూ లోనయ్యే ప్రచార మాధ్యమాలు ఆయనను మరింతగా పెంచి చూపించాయి. పత్రికలు అతన్ని విపరీతంగా గ్లోరిఫై చేసి తమ సర్క్యులేషన్‌ను పెంచుకున్నాయి. అయితే అవే పత్రికలు, బడా బడా మార్కెట్లు అవసరం తీరాక అతని వ్యక్తిగత జీవితంలోకి అమితంగా జొరబడి ప్రశాంతతను కొల్లగొట్టాయి. ఆఖరుకు అనుకోని రీతిలో ప్రాణాలను సైతం కర్కశంగా లాగేసుకోవడం విషాదాంతమే! ★

క్రైమ్ కథ

- యర్నాగుల సుధాకరరావు

నల్లమబ్బు

“కేవలం నల్లమబ్బులచాటున ఒక హత్య జరిగితే ఏఒక్కరు హంతకుడ్ని చూడలేకపోయారు. హంతకుడు ఒక్క ఆనవాలుకూడా వదిలిపోలేదు. అందుకే చేతులు ముడుచుకుని కూర్చోవాల్సివచ్చింది. ఏం చేయాలో పాలుపోవడంలేదు. హత్యకు గురైంది పెద్ద వ్యాపారవేత్త సందీప్. పైగా హంతకుడు కోటిరూపాయిలు దోచుకుని పోయాడు. కేసు నెలరోజులు కావస్తున్నా ఇంతవరకు వీసమెత్తు ముందుకు సాగలేదు. అధికార్లకు గుర్తుకు వచ్చినపుడు 'ఏమిచేశావ్?! ఇంకా ఏమీ సాధించకపోతే ఎవరైనా ప్రయివేట్‌వారికి అప్పగిద్దాం' అని మానసికంగా హింసిస్తున్నారు. మీరు రోడ్లమీద తిరుగుతుంటారు. ఇప్పటికి మీరు ఏమీ సాధించలేదు” క్రయిమ్బు ఇన్‌స్పెక్టర్ శ్యామ్, ఎదురుగా నిలబడున్న పోలీసులపై రుసరుసలాడాడు.

“సార్ ఇదేదో గూడుపురాణీగా సాగింది. పెద్దమొత్తం ఎత్తుకు పోయారు. హంతకుడు చంపేటపుడు సందీప్ పక్కనే అతడి డ్రయివర్ డేవిడ్ ఉన్నాడు. అతడికి గుండు కాలిపిక్కకు రాచుకుని వెళ్లిపోయింది.అతడు ఇంతవరకు డిశ్చార్జి కాలేదు. బెడ్‌మీద ఉన్నాడు. గాయం లోతుగా అయ్యింది. పదిరోజుల్లో నయమై ఇంటికి పోవచ్చు. అతడు మానసికంగా బాగా దెబ్బతిన్నాడంట. ఒకరకంగా అతడి పరిస్థితి ఆందోళనగానే ఉంది. బిపి తగ్గిపోయి నీరసించిపోతున్నాడు. ఎవరు వెళ్లినా 'హంతకుడు దొరికాడా?' అని అడుగుతాడు తప్పితే ఇతరత్రా ఏమి మాట్లాడడు. మన ఆఫీసర్లు ఎన్నో రకాలుగా అడిగారు. మేమూ అడిగాం. అందరికి అతడు చెప్పేది ఒక్కటే. ఇక అతడిద్వారా హంతకుడ్ని పట్టుకోలేం. హంతకుడ్ని అస్పష్టంగానే అయినా డేవిడ్ తప్ప ఎవరూ హంతకుడ్ని చూడలేదు. మబ్బులు దట్టంగా వుండడం వలన హంతకుడ్ని చీకట్లో సరిగ్గా చూడలేకపోయాడు. నగరంలో ఎక్కడా ఎవరూ ఏమీ అనుకోవడంలేదు. లేకుంటే ఈపాటికి హంతకుడు దొరికిపోయేవాడే” ఒక కానిస్టేబుల్ చెప్పి ఇన్‌స్పెక్టర్ ముఖంలోకి చూశాడు.

ఇన్‌స్పెక్టర్ ఠాణాలోంచి బయటికివచ్చి వాన్ ఎక్కాడు. అర్ధరాత్రి కావస్తోంది. సరిగ్గా అప్పుడే పైఅధికారి సెల్‌లో “సందీప్ హత్య విషయం *గాలికి వదిలేసి గుర్రెట్టి నిద్రపోతున్నావా?”* అని కోపంగానే అడిగాడు.

“లేద్సార్. నేను ఆపనిమీదే తిరుగుతున్నాను. ఇప్పుడు ఠాణాలోనే ఉన్నాను. అన్నివైపులా గాలాయించి వెతుకుతున్నాను సార్”

“దొరికాడా హంతకుడు? అది చెప్పవయ్యా! నువ్వు జాగారం చేస్తే హంతకుడు నీఎదుట ప్రత్యక్షమై దొరికిపోతాడా? చూడు ఇలాంటి మాటలు ఇక వినదలుచుకోలేదు. హంతకుడ్ని నాకళ్లముందు నిలపాలి. అంతవరకు నేను పడుకోను. నిన్ను పడుకోనివ్వను” చెప్పి కట్ చేసాడు.

ఇన్‌స్పెక్టర్‌కు మానసికంగా రెపరెపలాడి పోయాడు.

తానే స్వయంగా వాన్ నడుపుకుంటూ ఇంటిదారిపట్టాడు.

'ఈరాత్రిమీద డేవిడ్‌ను కలిస్తే వాడు ఏమైనా హంతకుడి కోసం క్లూ అందిస్తాడా లేక పాడిన పాటే విన్పిస్తాడా? మరోసారి వాడిని లాలించి గుర్తుచేసుకోమని చెప్పాలి' అని అటు తిప్పాడు వాన్.

హతుడు సందీప్ కుటుంబసభ్యులే అతనికి ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. డేవిడ్ నమ్మకస్థుడు. వారి తలలో నాలుకలాంటి వాడు. పోర్టికోలో వాన్ ఆపి దిగాడు. వర్షం పెద్దగా కురుస్తుంటే వార్డులవైపు తడుచుకునే వెళ్లాడు. కరెంటు పోయింది. గాఢాంధకారంలో ఆసుపత్రి ఉంది. ఇన్‌స్పెక్టర్‌కు చికాకు అనిపించింది. 'కరెంటు పోతే అంతేనా జనరేటర్ లేదా' అని ఎవరినైనా అడుగుదామనుకున్నాడు. కానీ స్టాఫ్ జాడే లేదు.

నల్లమబ్బుల ఆకాశం వలన చీకటిగా ఉంది. ఎదురుగా అగ్గిపుల్ల కొట్టి సిగరెట్టు ముట్టించుకుని కన్పించాడు డేవిడ్. ఇన్‌స్పెక్టర్ కళ్లు పెద్దవయ్యాయి. నాలుగుదమ్ములు కొట్టి సెల్‌తీసి ఎవరికో రింగ్ చేసాడు. ఇన్‌స్పెక్టర్ చెవులు రిక్కించి తను నీడ కూడా డేవిడ్‌కు కనబడకుండా గోడకు అంటుకున్నాడు.

“మరొక నెల ఇక్కడ గడిపేస్తే సరిపోతుంది. గాయం ఆరోజే పోయింది. రాత్రివేళల్లో విస్కీ లేక చస్తుంటే డాక్టర్ అర్ధరాత్రివేళ నాకు నిబ్ ఇచ్చిపోతున్నాడు. తాగాక నిద్రపట్టి చావలేదు. ఇదిగో కరెంటు పోయింది. వరండాలోకి వచ్చాను ” మాట్లాడుతునే రూమ్‌లోకి వెళ్లిపోయాడు.

ఇన్‌స్పెక్టర్ షాక్‌లోకి వెళ్లినట్టు అయిపోయాడు. క్షణాల్లో పోలీసులను పిలిపించి డేవిడ్‌ను అరెస్టుచేసి తీసుకుపోయాడు. అంతా కరెంటు వచ్చేలోగా జరిగిపోయింది. డేవిడ్‌కు ఇంటరాగేషన్ చేస్తుంటే కానిస్టేబుళ్ళు “డేవిడ్ నిరపరాధి కదా. మరి ఇలా లాఠీఎత్తి గాయంమీద కట్టు పొడిచి మరీ తీస్తున్నాడు. వీడు లాకప్‌డెత్ అయిపోతే మనందరికి చుట్టుకుంటుంది” అని పెద్దకళ్లుచేసి చూసారు.

డేవిడ్ నీరసంతో అటు ఇటు ఊగిపోతున్నట్టు నటించాడు.

ఇన్‌స్పెక్టర్ పైఅధికారికి రింగ్‌చేసి “సార్ హత్యకేసులో కీలకవ్యక్తి దొరికిపోయాడు. మరికాసేపట్లో హంతకున్ని పట్టుకుంటాను సార్. మీరు నన్ను నిద్రపోనివ్వనందున నేను ఎక్కడెక్కడో తిరిగి పట్టేశాను” అంతా వింటున్నట్టుగానే చెప్పాడు.

లాఠీతో గాయంమీద కట్టు పీకేశాడు. గాయం లేదు. అంతా ఆశ్చర్యపోయారు. డేవిడ్‌పై లాఠీ లేచేసరికి నిజం ఒప్పేసుకున్నాడు. “సార్ సందీప్ కు నమ్మినబంటుగా ఉన్నాను. ఒకస్థలం అమ్మగా వచ్చినకోటిరూపాయలను నేను మరో డ్రయివర్ జిలాని కొట్టేయాలనుకున్నాం. పథకం వేసాం. డబ్బుతో వస్తుండగా నిర్మానుష్యమైన రోడ్డుమీద నేను కావాలనే కారు ఆపాను. వెంటనే జిలానీ పిస్తోలుతో కాల్చిచంపాడు.సూటుకేసుతో మోటార్ సైకిల్‌మీద పారిపోయాడు. నేను నా దగ్గరున్న పిస్తోలుతో నా కాలిపిక్కకు బుల్లెట్ ఒరుసుకుపోయేట్టు కాల్చుకుని స్టీరింగ్‌మీద పడిపోయాను. అప్పటికే రోడ్డున పోయేవాళ్లు పోలీసులకు చెప్పారు.నాకు తీవ్రరక్తస్రావం అయ్యింది. నన్ను ఎవరూ అనుమానించరు. ఇక జిలాని ఎప్పటిలానే సందీప్ ఇంట్లో మరో కారుకు డ్రయివర్‌గానే ఉన్నాడు. నేను వెళ్లాక ఇద్దరం దోచుకున్నది పంచుకుని వేరే చోటుకు పోవాలనుకున్నాం”

జిలానీని ఆరాత్రే అరెస్టుచేశారు. అతడివద్ద పోయిన సొత్తు రికవరీ చేశారు. డేవిడ్‌లో ఇంతటి నమ్మకద్రోహి ఉన్నాడా అని సందీప్ కుటుంబసభ్యులు నోళ్లుతెరిచారు. ★

కథ

షేర్ షాక్

- జి. అనసూయ

వంట పూర్తి చేసి అన్నీ సర్ది తృప్తిగా చూసుకుంది హేమ. ఉన్నది ఒకే గది. అదే కిచెన్, బెడ్‌రూం అన్నీ. వంట వాసన పోవడానికి కిటికీలు బార్లా తెరిచి ఉంచింది. రూమంతా తుడిచి సర్దింది. చాలా రోజుల తరువాత మనసంతా హాయిగా గాల్లో తేలుతున్నట్లుగా ఉంది. తమ చిన్నగదే అందంగా, రొమాంటిక్‌గా కన్పిస్తున్నది. స్నానం చేయడానికి వెళ్ళింది. చల్లటి నీళ్ళు ఒంటి మీద పడగానే ఏదో పులకరింత. అలా మనసారా స్నానం చేస్తూ ఎంతసేపు ఉండిపోయిందో! బాత్‌రూంలోంచి బయటకు వచ్చేసరికి చుట్టూ చీకట్లు. అరవింద్ ఇంకా రాలేదు. పాపం, అలసిపోయి వస్తాడు. తన క్వాలిఫికేషన్‌కు, తెలివితేటలకు తగిన ఉద్యోగం దొరకలేదని ఎంత నిరాశో! ఇదంతా తన వల్లనే. వాళ్ళ ఇంట్లో ఇష్టం లేకుండా తనను పెళ్ళి చేసుకోవడం వల్లనే కదా అరవింద్ ఒంటరి వాడయ్యింది. అదీగాక ఏ డబ్బున్న అమ్మాయినో పెళ్ళి చేసుకున్నా ఈ కష్టం ఉండేది కాదుగా. హేమ మనసంతా అరవింద్ పట్ల ప్రేమ, జాలితో నిండిపోయింది.

తనకు ఈ రోజే ఓ ప్రైవేటు స్కూల్లో జాబ్ దొరికింది. ఇక అరవింద్ ఇలా రాత్రింబగళ్ళు పని చెయ్యక్కర్లేదు. కొంచెం లీడర్‌గా వుండి గ్రూప్స్‌కి ప్రిపేర్ అవమని చెప్పాలి అనుకుంది హేమ.

మెట్ల మీద అడుగుల చప్పుడు. "అరవింద్ వస్తున్నట్లున్నాడు. తను కనపడకపోతే అతని రియాక్షన్ చూడాలి" అనుకుంటూ తలుపుచాటుగా నిలబడింది హేమ. రోజూ తనకు ఎదురొచ్చి నవ్వుమొహంతో రిసీవ్ చేసుకునే హేమ కనపడక పోయేసరికి కంగారు పడ్డాడు. దగ్గరగా వేసి ఉన్న తలుపులు తెరిచి చూశాడు. అందంగా సర్ది ఉన్న గది ఆహ్లాదకరంగా వస్తున్న రూంఫ్రెషనర్ పరిమళం ఎదురుగా మంచం మీద పరిచి ఉన్న గులాబీ రంగు దుప్పటి.

"వండ్రఫుల్" అనుకుంటూ మంచం మీద కూర్చున్నాడు. షూస్ విప్పుకోవడానికి కిందకు వంగుతూ అప్పుడు చూశాడు హేమను. అప్పుడే స్నానం చేసిందేమో. ఫ్రెష్‌గా, ఎన్నడూ లేనంత అందంగా కనిపించింది.

"హాయ్ హేమా! ఏంటివాళ మన ఇల్లు ఇల్లాలితో పోటీ పడుతున్నట్టుంది" ఆనందంలో అన్నాడు అరవింద్ ఉత్సాహంగా. "ఊ... చెప్పండి ఇల్లు బాగుందా? ఇల్లాలు బాగుందా?" అంది హేమ ఎదురుగా వస్తూ.

"ఇల్లు చాలా బాగుందోయ్ కాని ... ఇల్లాలి ముందు అది సిగ్గుపడుతుంది" హేమ నున్నటి చెక్కిళ్ళను చేత్తో తాకుతూ అన్నాడు అరవింద్. "పొండి... అన్నీ దొంగ మాటలు.. వెళ్ళండి.. త్వరగా స్నానం చేసిరండి..." అరవింద్‌ని బాత్‌రూంలోకి తరిమింది హేమ. భోజనానికి అన్నీ సిద్ధం చేస్తూ చెప్పింది తనకు ఉద్యోగం వచ్చిన విషయం.

"కంగ్రాట్స్ హేమా!" అన్నాడే గాని అంత మనస్ఫూర్తిగా అన్నట్లు అనిపించలేదామెకు. హేమ ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి వచ్చినందుకు బాధగా ఉంది అరవింద్‌కు. "ఏమిటి అరవింద్! బాధ పడుతున్నావా. నాకైతే ఉద్యోగం చెయ్యడం సంతోషమే. కేవలం మనీ కొరకే కాదు. పోనీ నీకు ఇష్టం లేకుంటే మానేస్తాలే.." అంది హేమ.

"అహ అదేం లేదు హేమా. పద పద నాకు ఆకలేస్తోంది. త్వరగా అన్నం పెట్టు" చిన్న పిల్లవాడిలా అన్న అరవింద్‌ను మురిపంగా చూసింది హేమ.

అరవింద్ ఓ ఫైనాన్స్ కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి అన్నిటికి కాంప్రమైజ్ అవుతూ పెరిగిన అరవింద్‌కు తన మీద తనకు అంతులేని విశ్వాసం. ఎప్పటికైనా బాగా సంపాదించి డబ్బుతో కొనగలిగే ప్రతిదీ కొనుక్కోవాలని. తనను నమ్మి అయినవాళ్ళందర్నీ వదిలి తనను పెళ్ళి చేసుకున్న హేమను సుఖాలలో ముంచెత్తాలని అరవింద్ ఆశ. ఇప్పుడున్నది ఒక తాత్కాలిక దశ మాత్రమే. పోనీ ఉద్యోగం చెయ్యడంవల్ల తనకూ కొంత కాలక్షేపం అవుతుంది. అలాగే తన జీతం మొత్తం ఏదైనా బిజినెస్‌లో పెట్టొచ్చు" అనుకున్నాడు అరవింద్.

కొత్తగా పెళ్లయి వచ్చిన ఆ జంటకు మేడ మీద ఒక్కటే గది దొరకడం కూడా ఓ వరం లాగే ఉంది. మెట్ల మీద పైకి వెళ్ళే తలుపులు మూసేస్తే చాలు రాత్రంతా అది వాళ్ళ సామ్రాజ్యమే.

మంచి ఇల్లాలిగా ఇంటిని పొందిగ్గా తీర్చిదిద్దుకోవడం, వేళకు కమ్మగా వండి పెట్టటం, ఖాళీ సమయాల్లో తన కిష్టమైన పుస్తకాలు చదువుకోవడం. హేమ మంచి ఇల్లాలే కాదు మంచి టీచరు కూడా. కొద్ది రోజుల్లోనే తోటి టీచర్లు, విద్యార్థుల ప్రేమకు పాత్రురాలయింది.

అరవింద్‌కు వేరే లోకమే లేకుండా పోయింది. గది రెంటు కట్టడం తప్ప మ రే విషయాలూ పట్టించుకునేవాడు కాదు. అన్నీ హేమే చూసుకునేది. ఏ రోజు అరవింద్‌ను డబ్బు విషయంలో లెక్కలు అడిగేది కాదు. ఆరు నెలల తర్వాత తెలిసింది. హేమకు, అరవింద్ తన జీతాన్నంతా షేర్లు కొనడం కొరకే పెడుతున్నాడని. ఆమెకు షేర్ల గురించి అంతగా తెలియదు. షేర్ల బిజినెస్ చాలా రిస్క్‌తో కూడుకున్నదని విన్నది. ఆ మాటే అరవింద్‌తో అంటే

"అసలు జీవితమే రిస్క్ హేమా, ఇలా భయపడితే ఏదీ సాధించలేం. చూస్తుండు మరో రెండు మూడేళ్ళలో మనం ఎలా ఉంటామో" అంటూ తేలిగ్గా కొట్టిపారేశాడు. నిజమే అరవింద్ చాలా తెలివైనవాడు. అతని సమయస్ఫూర్తి, మాటకారితనం, కష్టపడే స్వభావం, అన్నిటికీ మించిన ఆత్మవిశ్వాసం అతని సొంతం.

ఏడాది తిరిగే సరికి వారి ప్రేమను పంచుకోవడానికి, ఓ ముద్దుల పాపాయి వచ్చి చేరింది. పాప పుట్టిన వేళా విశేషమేమోగాని అరవింద్ బిజినెస్ బాగా

పుంజుకుంది. మంచి ఫ్లాట్‌లోకి మారారు. మరో ఆర్నెల్లలో కారు కొన్నాడు అరవింద్. ఇంట్లోకి కలర్‌టీవీ, కంప్యూటర్, ఇంటర్నెట్, కిచెన్‌లోకి అన్ని ఆధునిక సౌకర్యాలు వచ్చి చేరాయి. హేమ ఒంటినిండా ఖరీదైన నగలు. కోరినా కోరక పోయినా లేటెస్ట్ డిజైన్ల చీరలు. పాపాయికి రెండేళ్లు నిండగానే ప్లేస్కూల్లో అడ్మిషన్.

"హేమా! నీవు ఆ జాబ్ మానేసి నాకు అసిస్ట్ చెయ్యి" అంటూ హేమను ఉద్యోగం మానిపించేశాడు అరవింద్. వదులుకున్న బంధుత్వాలు దార్లు వెతుక్కుంటూ వస్తున్నాయి. అరవింద్‌కు సంపన్నుల లక్షణాలన్నీ వచ్చేశాయి. ఇప్పుడతను సిటీలోని పెద్ద షేర్ బ్రోకర్. లయన్స్ క్లబ్ మెంబరు. మంచి స్పెక్యులేషన్ ఉన్న బిజినెస్ మ్యాన్. మధ్య తరగతి కుటుంబాలవారు తమ ఆస్తులను, బంగారాన్ని అమ్మి షేర్లు కొంటున్నారు. తన కష్టమర్లకు ఎప్పటికప్పుడు సరైన సమాచారం ఇవ్వడం, లాభాలకు వారి షేర్లను అమ్మిపెట్టడం. అత్యవసరమైతే ఆ షేర్లను తనే కొని వారికి డబ్బు సర్దడం. అలాంటివన్ని అరవింద్‌లో పాజిటివ్ వ్యాపార లక్షణాలు.

రాత్రింబగళ్ళు స్టాక్ న్యూస్ తప్ప వేరే ధ్యాస లేదు. భోజనం చేస్తూ టీవీ చూస్తూ ఎవరితోనైనా మాట్లాడుతూ కూడా లాప్‌ట్యాప్‌లో లేటెస్ట్ పొజిషన్ చూస్తుండేవాడు. డబ్బు మాయలోపడి సర్వం మరచిపోతాడేమోనని భయం హేమకు.

"ఇంక చాలండీ.... ఈ అయిదేళ్లలో యాభయ్యేళ్ళ పని చేశారు. ఇంక వేరే ఏదైనా వ్యాపకం ఏర్పరుచుకుని ఈ బిజినెస్ మానెయ్యండి. ముందు మంచి ఇల్లు కట్టుకుందాం" అన్నది హేమ.

ఇల్లు కట్టుకోవడానికయ్యే ఇరవై లక్షలను ఇన్‌వెస్ట్ చేస్తే ఎన్ని కోట్ల లాభాలు వస్తాయో లెక్క చెప్పాడు అరవింద్. "ఇక ఈయన్ను మార్చడం నా వల్ల కాదు" అనుకుంది హేమ. షేర్ బజార్ పేరుతో ఆఫీస్ ఓపెన్ చేశాడు అరవింద్. దేశం మొత్తంలో సెన్సెక్స్ హై పిచ్‌లో ఉంది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ కంపెనీల షేర్లు పదులవి వందల్లో అమ్ముడుపోతున్నాయి. జనం పిచ్చి పట్టినట్టు షేర్లను కొంటున్నారు. ఆశ... ఆశే ప్రపంచాన్ని నడిపించే దిక్సూచి. మనీ... ఈజీ మనీ శ్రమ లేకుండా, మోసం లేకుండా కూర్చున్న చోటనే జాతకాలు తారుమారు చేసి మామూలు ఉద్యోగులను లక్షాధికారులను చేసే షార్ట్‌కట్, షేర్ మార్కెట్.

చిరుద్యోగులు, వృత్తిపనుల వాళ్ళు సైతం తమ కష్టార్జితాన్ని చిట్టీలు కట్టడం, సేవింగ్స్‌లో పెట్టడమే కాకుండా షేర్లు కొంటున్నారు.

హేమకు ఇదంతా మాయలా కనపడేది. ఈ షేర్ల వల్ల ఆ కంపెనీలకు ఒరిగేదేమిటి? అసలు వస్తూత్పత్తి లేకుండా ఈ ఊహాజనిత సంపద వల్ల దేశానికి లాభమా? నష్టమా? హేమ మనసు విప్పి ఎప్పుడైనా అరవింద్‌తో ఈ మాటంటే, ఈజీగా నవ్వేసేవాడు. తననో వెర్రిదానిలా చూసేవాడు. ఈ మధ్య అరవింద్ చాలా ఉత్సాహంగా ఉంటున్నాడు. తను పట్టిందల్లా బంగారం అవుతుందన్న నమ్మకం. షేర్ల ధరలు వందల రెట్లలో పెరుగుతోంటే పెరుగుతున్న తన సంపదను చూసుకొని పొంగిపోతున్నాడు. రోజుకో కొత్త వస్తువును గిప్టుగా తెస్తున్నాడు. కూతురి పుట్టిన రోజును నాలుగు లక్షల ఖర్చుతో ఫంక్షన్ హాల్లో అట్టహాసంగా జరిపించాడు.

హేమ ఓ రోజు పాపను స్కూల్లో దించి తిరిగివస్తూ ఉండగా కాలనీ మొదట్లో ఓ ఇంటి ముందు జనం గుమికూడి ఉన్నారు. పోలీస్ జీబు, అంబులెన్స్ కూడా ఆగి ఉన్నాయి. హేమ కారాపి విషయం ఏంటని ఓ నడివయసు స్త్రీని అడిగింది.

" ఆ... ఏముందమ్మా... ఉన్నప్పుడు కాళ్ళు భూమ్మీద ఆనలేదు, అదేందో యాపారంలో నష్టం వచ్చి, ఉన్నదంతా ఊడ్చుక పోయిందంట. భార్యాపిల్లలకు విషమిచ్చి తను ఉరేసుకున్నడు ఆ మారాజు" అన్నది. హేమ గుండెల్లో కలుక్కుమన్నది.

"అమ్మా... అమెరికాలో అదేందో ఆర్థికమాంద్యం వచ్చిందంట కదమ్మా.... చానామంది ఉద్యోగాలు పోతున్నయంట" అన్నాడు డ్రైవర్ హరి. అవును తనూ వింటూనే ఉంది, బ్యాంకులు, కంపెనీలు దివాలా తీస్తున్నాయి. రోజుకు కొన్ని లక్షల మంది ఉద్యోగాలు పోతున్నాయి.

ఆ సాయంత్రం అరవింద్‌తో చెప్పింది హేమ అదే విషయాన్ని. ఈసారి అంత తేలిగ్గా నవ్వేయలేదు అరవింద్. "అవును హేమా! పరిస్థితి ఏం బాలేదు. మార్కెట్ బాగా డల్‌గా ఉంది. పెద్ద పెద్ద కంపెనీలే బోర్డులు తిప్పేస్తున్నాయి. అయినా మనకు భయమేం లేదు హేమా. మన పెట్టుబడులన్నీ మిధ్యా కంపెనీలో ఉన్నాయి. దేశంలోనే నెంబర్‌వన్ సాఫ్ట్‌వేర్ కంపెనీ" అన్నాడు.

"ఏమోనండి మన విషయం వదిలేసినా అసలు ఇదంతా ఓ విషవలయంలా కనిపిస్తోంది".

"ఎక్కువ ఆలోచించకు హేమా.. కమాన్ చీరప్. పద బయటకు పోదాం" అంటూ మాట మార్చాడు అరవింద్.

నెల్లాళ్ళు గడిచాయో లేదో ఓ రోజు పిడుగులాంటి వార్త. మిధ్యా సంస్థ దివాలా తీసినట్టు ప్రకటించిందని ... దాని యాజమాన్యం అప్పటి దాకా బోగస్ నిల్వలు, తప్పుడు జమా ఖర్చులు చూపించి లాభాల్లో ఉన్నట్టు భ్రమల్లో ఉంచినందుకు క్షమాపణ చెబుతూ పోలీసులకు లొంగిపోయింది. అరవింద్ మోహంలో నెత్తురు ఇంకిపోయినట్లు పాలిపోయింది. "నో... నో ఇలా జరుగదు" అంటూ గుండె పట్టుకొని కుప్పకూలిపోయాడు.

హేమకు కాళ్లూచేతులు ఆడలేదు. క్షణాల మీద అతడ్ని హాస్పిటల్‌లో చేర్పించింది. ప్రాణాపాయం తప్పింది. మిధ్యా కంపెనీ షేర్లు వేలల్లోంచి పదుల్లోకి వచ్చాయి. ఏడు వందలకు అమ్మిన షేర్లు ఏడు రూపాయలకు పడిపోయాయి. జనంలో ఒక రకమైన అభద్రతా భావం. అరవింద్ ఫైనాన్షియర్స్ వత్తిడి తేవడం మొదలు పెట్టారు. అమ్మడానికి స్థిరాస్థులు కూడా లేవు. ఇంట్లో ఉన్న బంగారం, విలువైన వస్తువుల్ని అమ్మినా ఏ మూలకూ చాలలేదు. ఒక్కసారిగా కోట్ల రూపాయల విలువ వేలల్లోకి పడిపోవడంతో షాక్‌కు గురయ్యాడు అరవింద్. హేమ తన శక్తినంతా కూడదీసుకుంది. పరిస్థితిని చక్కబెట్టడానికి తనకు తోచిన దార్లన్నీ వెతుకుతోంది. ఈ సంపద ఈ కృత్రిమ జీవితం ఎండమావుల వెంట పరుగులు ఎవరికో సంపదను పోగెయ్యడానికి వెంపర్లాట.. తనలో అంతర్లీనంగా ఉన్న భయాలు, ఎక్కడో లోలోపల సిక్స్ సెన్స్ హెచ్చరికలు గుర్తొచ్చాయి.

డబ్బు ఉందన్న భ్రమలు లేనప్పుడు విలాస వస్తువులు లేవు. కార్లు లేవు. కాని తన భర్త, బిడ్డ క్షేమంగా ఉన్నారు. అరవింద్ డిశ్చార్జి అయి ఇంటికి వచ్చాడు. బోసిగా ఉన్న ఇంటిని చూశాడు. నెలాఖరుకు ఇల్లు కూడా ఉండదు. అడ్వాన్సు ఉంది కాబట్టి ఈ నెల వరకు ఉండొచ్చు. "ఆ తర్వాత... ఎలా ఎక్కడికి వెళతాం?" అరవింద్ మనసులో అశాంతి, అపరాధభావం.

"అవన్నీ ఆలోచించకు అరవింద్. మనం పెళ్లయిన కొత్తలో ఒక ఇంట్లో అదే మేడమీద గదిలో ఉన్నాం చూడు. ఆ గది ఇప్పుడు ఖాళీగానే ఉంది. నేను నిన్ననే వెళ్ళి మాట్లాడి వచ్చాను. ఆ గది అదే మన సామ్రాజ్యం మనకు ఇస్తామన్నారు ఇంటి ఓనర్. అలాగే నా ఉద్యోగం కూడా. పాపను కూడా అదే స్కూల్లో చేర్పించొచ్చు. నీ ఆరోగ్యం బాగయ్యాక ఏదైనా చూసుకోవచ్చు" అంటూ ధైర్యం చెప్పింది.

హేమ మొహంలోని ప్రశాంతతను ఆశ్చర్యంగా చూశాడు అరవింద్. విజయపు అంచులను అందుకున్న తను తిరిగి అట్టడుగుకు జారి నిలవగలడా, తన ఊహలు, వ్యూహం, అంచనాలు ఎక్కడ తలకిందులయ్యాయి? తల బద్దలవుతున్న భావం. రెండు చేతుల్తో తల పట్టుకున్నాడు అరవింద్.

"ఎక్కువగా ఆలోచించి ఎగ్జైట్ అవకు అరవింద్. ఇది మన ఒక్కరి సమస్యకాదు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది జనం పరిస్థితి ఇది. ఇలాంటి సమయాల్లోనే మనం బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలి. ఈ దళారి వ్యవస్థలో ఇలాంటి ఒడిదుడుకులు సర్వ సాధారణమే!" అంటూ ఓదార్చింది హేమ.

సాధారణ గృహిణిలా ఎప్పుడూ తన సంతోషం కొరకు ఆరాటపడే హేమలో ఇంత పరిణితి ఉందా! ఎన్నో సార్లు తనను హెచ్చరిస్తుంటే అదంతా తన పిరికితనం అనుకున్నాడు. ఈ హేమ లాంటి సహచరి లేకుంటే... తను ఏమై పోయేవాడు. ఈ రెండు వారాల్లో తను ఎన్నోవందల సార్లు ఆత్మహత్య గురించి ఆలోచించాడు. అవన్నీ గుర్తొచ్చి సిగ్గుపడ్డాడు అరవింద్. తేలికపడ్డ మనసుతో హేమ చేతిని అందుకున్నాడు.

★

చిటపట చినుకుల్లో మొక్కజొన్న తింటుంటే...

ఇంకా వర్షాలు గట్టిగా పడడం లేదు గానీ, సాయంత్రాలు చల్లని గాలులతో పాటు సన్నని తుంపర పడుతుంటే బొగ్గులమీద కాల్చిన మొక్కజొన్న పొత్తుల్ని తింటూ నడవడం ఒక రొమాంటిక్ అనుభూతి. బహుశా చాలామందికి ఈ అనుభవం కలిగే వుంటుంది.

- డా॥విజయ్

మన ప్రాంతాలలో పచ్చి మొక్కజొన్నని వుడకబెట్టి గానీ, బొగ్గులమీద కాల్చిగానీ, ఎండిన వాటిని వేపి గానీ (పేలాలు - పాప్‌కార్న్) తింటాం. అయితే తర్వాతి స్థానాన్ని మొక్కజొన్న ఆక్రమించుకుంటుంది. మొక్కజొన్న గింజల్ని నేరుగా తినడం ఒక పద్ధతైతే వాటి పిండిని అనేక రకాలుగా వాడటం మరింత వ్యాప్తి చెందింది.

పురాతన చరిత్ర

ఆంగ్లంలో మెయిజ్ గానీ కార్న్ గానీ అనే మొక్కజొన్న దాదాపు 10,000 సంవత్సరాల క్రితం నుండే సాగుబడిలో వున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం మెక్సికోగా వున్న ప్రాంతంలో అప్పట్లో 'ఇండియన్లు' మొక్కజొన్నను పండించేవాళ్లు. అప్పటి వరకూ అక్కడక్కడా, ఇష్టానుసారం పెరిగే మొక్కల నుండి మొక్కజొన్నను సేకరించినా, క్రీస్తుపూర్వం 5000 కల్లా తమంత తామే దాన్ని పెంచడం అలవర్చుకున్నారు. అందువల్ల దానిని 'ఇండియన్ కార్న్' అంటారు. అయితే రంగురంగుల విత్తులున్న మొక్కజొన్నలను మాత్రమే అలా పిలిచారు. కొలంబస్ 1492 లో క్యూబా లో కాలిడే వరకూ యూరోపియన్లకు మొక్కజొన్న గురించే తెలియదు. క్రీస్తుశకం 1500లలో ఆఫ్రికా, ఆసియా, యూరప్, మధ్య ప్రాచ్య ప్రాంతాలలో మొక్కజొన్న విరివిగా వ్యాపించింది. అయితే ఇప్పటికీ మొక్కజొన్న పండించడంలో, ఎగుమతి చేయడంలో అమెరికాదే ఆధిపత్యం. ఇప్పుడు మానవ ప్రమేయం లేకుండా పకృతిలో మొక్కజొన్న మొక్కే లేదు.

పోషక విలువలు

మొక్కజొన్న లో కార్బోహైడ్రేట్లు పుష్కలంగా వున్నాయి. కానీ ప్రోటీన్లు కాస్త తక్కువ, పైగా వాటిలో కొన్ని అవసరమైన అమైనో ఆమ్లాలు (లైసిన్, ట్రిప్టోఫాన్) లోపిస్తాయి. అందువల్ల కేవలం మొక్కజొన్నను మాత్రమే ఆహారంగా తీసుకునే వారిలో ప్రోటీన్ లోపాలు కనిపిస్తాయి. పెల్లగ్రా అనే వ్యాధికూడా మొక్కజొన్నలో నియాసిన్ (బి-విటమిన్) లోపించడం వల్ల మనకి వస్తుంది. కానీ మనలా అప్పుడప్పుడూ తినడం వల్ల పెద్ద నష్టమేమీ లేదు- అంతా లాభమే!





వంద గ్రాముల మొక్కజొన్నలో ...!

19 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 3.2 గ్రాముల చక్కెర పదార్థాలు, 2.7 గ్రాముల పీచు, 1.2 గ్రాముల కొవ్వు పదార్థాలు, 3.2 గ్రాముల ప్రోటీన్లు, విటమిన్ ఎ,బి,బి1, బి3, విటమిన్ సి, ఇనుము, మెగ్నీషియం, పొటాషియం లభిస్తాయి.

మొక్కజొన్న లోని పీచుపదార్థాల వలన కొలెస్టరాల్ తగ్గే అవకాశాలున్నాయి. దీనిలో ఫోలేట్ అధికంగా వుంది. అది కణాల పెరుగుదలకు, కొత్త కణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది. ఇవన్నీ ఒక ఎత్తైతే, మొక్కజొన్న నమలడం వల్ల దవడలకు మంచి వ్యాయామం.

సర్వాంతర్యామి

కార్న్‌ఫ్లేక్స్, మైదాపిండి, కార్న్‌పిండి సూపు వంటివే కాకుండా ఎన్నోరకాల వంటకాలలో మొక్కజొన్న పిండిని వాడటం పరిపాటే.

దీని నుండి వంట నూనె కూడా తీస్తారు. పైగా సిరప్‌లు, ఆల్కహాలు చేస్తారు. బీరు, విస్కీ వంటి మద్యాల తయారీలో దీనిని ఉపయోగిస్తారు.

ఇంకా గింజల్ని, మొక్క కాండాన్నీ చిన్న చిన్న ముక్కలుగా చేసి పశువులకు, పందులకు, కోళ్ళకు దాణాగా వాడతారు.

ఇవన్నీ కాక మొక్కజొన్న నుండి ప్లాస్టిక్కులు, వస్త్రాలు, జిగురులు కూడా తయారౌతాయి.

మొక్కజొన్న పొత్తులో (పొత్తిళ్ళలో) గింజలు పిల్లల్లా భద్రంగా వుంటాయి. ఆ గింజలకు మెత్తదన్నాన్ని ఇవ్వడానికా అన్నట్టు సన్నని పట్టువంటి మృదువైన పోగులుంటాయి. ఆ పోగులు నిజానికి ప్రత్యుత్పత్తి భాగాలు- ఫలదీకరణకు తోడ్పడతాయి. వాటిని హెర్బల్ ఉత్పత్తులుగా వాడతారు.

ఇప్పుడైతే మొక్కజొన్న బయోఫ్యూయల్ (జీవ ఇంధనాలు) తయారీలో ఇథనాల్ వంటివి - వాడుతున్నారు కూడా. ఇంకా పూర్తిగా పరిపక్వత చెందని మొక్కజొన్న పొత్తుల్ని 'బేబీ కార్న్' గా వండుకుంటున్నారు. ఇటీవలి కాలంలో స్వీట్ కార్న్' వాడకం పెరిగిందని తెలిసిందే!

చిన్న చెరుకు గెడలా కనిపిస్తూ, ఆకుల ప్రాంతాలలో పొడుచుకొచ్చిన లేత ఆకుపచ్చరంగు రాకెట్లలా, సన్నని, తెల్లని 'వెంట్రుకల'తో, వొలిచి చూస్తే లేత బంగారు రంగులో అందమైన పలువరసలా కనిపించే గింజలతో మొక్కజొన్న భలే అందంగా ఉంటుంది. ఇక సరైన రుచిగల పొత్తు తగలాలే గానీ... తింటుంటే మహదానందంగా వుంటుంది. అటువంటి అనుభూతి కోసం... తుంపర్లు పడుతున్న సాయంకాలాలే అవసరం లేదు. మొక్కజొన్నను ఎలాగైనా, ఎప్పుడైనా ఆస్వాదించవచ్చు. ఏవంటారు?!

★





అరుదైన సేకరణ



ప్రపంచంలో వివిధ రకాల సైజులలోనూ, ఆకారాలలోనూ ఉన్న అరుదైన ఏనుగు బొమ్మలను డాక్టర్ గౌరీ సేకరించారు. కాలిఫోర్నియాలోని లాస్ ఏంజెల్స్‌లో స్థిరపడిన ఈ లేజర్ సైంటిస్ట్ భారతీయ మహిళ. ఈమె బాగా చిన్న చిన్న రూపాలలో ఉన్న అరుదైన, అందమైన, ఆకర్షణీయమైన ఏనుగుల బొమ్మలు సేకరించారు. గౌరి సేకరించిన ఏనుగు బొమ్మలలో మొట్టమొదటిది ఆమెకు ఆరేళ్ళ వయసులో ఆమె తండ్రి బహుమతిగా ఇచ్చినది. ఆయన దాన్ని హైదరాబాద్ నుండి తీసుకువచ్చారు. ఒక మహారాజును తీసుకువెళుతున్నట్లు అది చాలా అందంగా అద్భుతంగా చిత్రించబడింది. టీనేజ్‌లో ఒక హాబీగా మొదలు పెట్టిన ఈ బొమ్మల సేకరణ క్రమంగా అరుదైన ఏనుగుల బొమ్మలను సేకరించాలనే పట్టుదలను ఈమెలో పెంచింది. విద్యార్థిగా యునైటెడ్ స్టేట్స్‌కు వెళ్లడం ఆమె హాబీకి మరింత సహకరించింది. అంతేకాక ఆమె ఈ అరుదైన చిన్న చిన్న ఏనుగుల బొమ్మలను చైనా, జర్మనీ, ఆస్ట్రియా, ఇండోనేషియాల నుండి సేకరించింది. అంతేకాదు. ఇండియా నుండి కూడా. పేముతో తయారు చేసిన ఏనుగుబొమ్మంటే ఆమెకు బాగా ఇష్టం. దీనిని ఆమె లాస్ ఏంజెల్స్‌లో ఒక షాపులో కొన్నది. అది తన స్కూలు ఖర్చులకిచ్చన డబ్బుతో కొన్నది. చాలా అరుదైన బొమ్మగా గుర్తింపు కూడా పొందింది. ఒకదాని కొకటి కట్టబడిన రెండు ఏనుగులు దుంగలను లాగుతున్నట్లున్న బొమ్మ మరొకటి. దీనిని ఆమె కేరళలో కొన్నారు. అన్నింటికన్నా తాను డిస్నీలాండ్‌లో కొన్న ప్లాస్టిక్ ఏనుగు బొమ్మ చాలా అందమైనదంటారామె.

తెలుసా!

కుడి ఎడమలు

1700 ప్రాంతాల్లో అమెరికాలో 'కానె స్టోగాన్' అనే వ్యాగన్లు బాగా వాడుకలోకి వచ్చాయి. ఇవి పెద్ద పెద్ద చక్రాలతో ఉండి, నాలుగు గుర్రాలచే (ముందు రెండు, వెనుక రెండు) నడుపబడుతుండేవి. ఈ వ్యాగన్లను నడిపే డ్రైవర్‌కు కూర్చోడానికి సీటు ఉండేదికాదు. వెనుక ఉన్న గుర్రాలకు ఎడమపక్క బండి నడిపేవాడు కూర్చునేవాడు. బళ్ళు ఎడమ పక్కగా నడపడంవల్ల వారికి ఎదురుగా వచ్చే వాహనాలు సరిగ్గా కన్పించక తరచూ ఢీకొనేవి. దాంతో వీరు కుడి పక్క నడపడం మొదలు పెట్టారు. కాలక్రమేణా అమెరికాలో, ఇంకా అటువంటి వ్యాగన్లు నడిపే ఇతర దేశాలలో కుడిపక్క బళ్ళు నడపాలనే రూల్ అమల్లోకి వచ్చింది. ఇంగ్లండ్‌లో బళ్లు చిన్నవిగా ఉండి రెండు గుర్రాలచే నడిపేవారు. వీటిలో బండి నడిపే వారు కుడి పక్క కూర్చోవడానికి సీటు వుండేది. ఎదురుగా ఏదన్నా బండి వచ్చేటప్పుడు వారు ఎడమ పక్కకు పోనివ్వడం సుఖంగా వుండేది. క్రమంగా ఇంగ్లండ్‌లో ఎడమ పక్క నడపడమే రూల్ అయ్యింది. ఇదే పద్ధతి ఇంగ్లండ్ బ్రిటీష్ ప్రాభవం వెలిగిన అన్ని దేశాల్లోనూ పరిచయం చేసింది. భారత్‌తో సహా.





వింత పుష్పాలు

వైట్ మేరీ గోల్డ్ చాలా అరుదుగా లభిస్తుంది. 1945లో అమెరికాకు చెందిన బర్పీ కంపెనీ ఈ పువ్వు నిమిత్తం ఎలిస్ వోంక్ అనే అతనికి 20,000 డాలర్లు బహుమతిగా ఇచ్చింది. 'పుయు ఏల మండే' అనే మొక్క పువ్వు వికసించడానికి 150 ఏళ్ళు పడుతుంది. సెంచరీ ప్లాంట్స్ అనే మొక్కలు 40 సంవత్సరాల తరువాత పూలు పూయనారంభిస్తాయి. కొన్ని పువ్వుల ఆకారాలు కూడా చిత్రంగా వుంటాయి. 'డువేలియా' అనే పువ్వు నక్షత్ర చేప ఆకారంలో ఉంటుంది. 'షూటింగ్ స్టార్' అనే పువ్వు దూరం నుంచి చూస్తే నక్షత్రాలు రాలిపడుతున్నట్లు కనబడుతుంది. అమెరికాలో లభించే 'గెలిన్సోగా పర్విఫ్లోరా' అతి చిన్న పువ్వు. ఇది ఒక మి.మీ పొడవుంటుంది. కాగా ఉత్తర భారతదేశంలో లభించే 'పిలియా మైక్రోఫిల్లా' అనే పువ్వు మరింత చిన్నది. దీని వ్యాసం 0.మి.మీ వుంటుంది.

దాల్ పాయసం

కావలసినవి

పెసరపప్పు - 100 గ్రాములు
శనగపప్పు - 100 గ్రాములు
బియ్యం - 100 గ్రాములు
పాలు - 1లీటరు
కొబ్బరి - కాయలో సగం
పంచదార - 1కిలో
జీడిపప్పు - 100 గ్రాములు
కిస్‌మిస్ - 50 గ్రాములు
యాలకులు - 5
నెయ్యి - పావు కిలో

తయారుచేయు విధానం

సెనగపప్పు, పెరసపప్పు, జీడిపప్పు వేరువేరుగా బాగా వేయించుకోవాలి. కొబ్బరి కోరుకోవాలి. బియ్యం కడిగి స్టౌమీద పెట్టి అన్నం ఒక పొంగు వచ్చిన తర్వాత దానిలో... వేయించిన శగపప్పు, పెసరపప్పు వేసి కొద్దిగా వుడకనివ్వాలి. సగం వుడికిన తర్వాత అందులో పాలు పోయాలి. అన్నం బాగా మెత్తగా ఉడికిన తర్వాత పంచదార వేసి కలపాలి. చివరిగా తురిమిపెట్టుకున్న కొబ్బరి కోరు, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌లు, యాలకుల పొడి వేసి బాగా కలియబెట్టాలి. స్టౌమీద నుండి దింపేముందు నెయ్యి పోసి మూత పెట్టాలి.
ఇది వేడి వేడిగా తింటే చాలా రుచిగా వుంటుంది.



పాలకోవా

కావలసినవి

పాలు - 1లీటరు
పంచదార - ముప్పావు కిలో
యాలకులు - 10

తయారు చేసే విధానం

పాలు స్టౌమీద వుంచి బాగా కలియబెడ్తుండాలి. పాలు మీగడ కట్టకుండా కొంచెం ముద్దగా అయ్యే వరకూ అలా కలుపుతూనే ఉండాలి. ఇలా ముద్దగా అయిన పాలలో పంచదార వేస్తే కొంచెం పలుచబడుతుంది. మరలా కొంచెంసేపు స్టౌమీదే ఉంచి కొద్దిగా దగ్గరగా వచ్చేవరకూ కలపాలి. ఇప్పుడు దీన్ని నెయ్యి రాసిన పళ్లెంలో వేసి యాలకులపొడి పైన చల్లి చాకుతో ముక్కలుగా కోసుకుంటే చాలు. నోరూరించే పాలకోవా రెడీ.



పెసర సున్ని

కావలసినవి

పెసలు - కిలో
పంచదార - అర కిలో
నెయ్యి - పావు కిలో
యాలకులు - 50 గ్రాములు

తయారుచేయు పద్ధతి

పెసలు దోరగా వేయించి పిండి చేసుకోవాలి. ఈ పిండి మరీ మెత్తగా వుండకూడదు. పంచదార కూడా పొడి చేసుకోవాలి. పెసరపిండి, పంచదార కలిపి అందులో మరిగించిన నెయ్యి పోయాలి. అందులోనే యాలకుల పొడిని కూడా వేసి ఈ మిశ్రమాన్ని బాగా కలిపితే ముద్ద ముద్దగా వుంటుంది. ఇప్పుడు దీన్ని మనకు కావలసిన సైజులో వుండలు చేసుకుంటే సరి. ఇవి పదిహేను, ఇరవై రోజుల వరకు నిల్వ ఉంటాయి.



పెసర పూర్ణాలు

కావలసినవి

పెసరపప్పు - పావుకిలో, పంచదార - 1కిలో
కొబ్బరి - సగం కాయ, మినప పప్పు - 125 గ్రాములు
బియ్యం - 125 గ్రాములు, కిస్‌మిస్ - 50 గ్రాములు
యాలకులు - 10, నెయ్యి - పావు కప్పు
నూనె - అర కిలో

తయారు చేసే పద్ధతి

బియ్యం, మినప్పప్పు కలిపి నానబెట్టి దోశ పిండిలా రుబ్బుకోవాలి. పెసరపప్పు నానబెట్టి పొట్టు లేకుండా కడిగి పెట్టుకోవాలి. పెసరపప్పు ఉడకబెట్టుకుని నీళ్లు లేకుండా వడకట్టి మెత్తగా పిండిలా చేయాలి. ఈ పిండిలో కొబ్బరికోరు, పంచదార, కిస్‌మిస్, నెయ్యి వేసి బాగా కలియబెట్టి చిన్న చిన్న వుండలు చేసి పెట్టుకోవాలి. ఈ వుండలను దోశపిండిలో ముంచి బాగా కాగిన నూనెలో వేసి దోరగా వేయించుకుంటే బావుంటాయి.



కొత్త పుస్తకాలు

తీయని వేదన



తీయని వేదన
నవలా రచయిత జె.యస్.రఘుపతిరావు
వెల రూ.100/- ప్రకాశకులు
జనశ్రుతి పబ్లికేషన్స్
తిరుపతి
లభించు స్థలం:
ప్రజాశక్తి, విశాలాంధ్ర బుక్‌హౌస్.

ప్రస్తుతం ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న భయంకర వ్యాధి "ఎయిడ్స్" గురించి ఎన్నో పుస్తకాలు వస్తున్నాయి. అయితే ఆ మహమ్మారి రోగం నేపథ్యంగా "తీయని వేదన" నవల వెలువడటం ఒక ప్రత్యేకతను సంతరించుకొంది. బహుగ్రంథకర్త, మేధావి పదవీ నివృత్త ఇంజనీరు జె.యస్. రఘుపతిరావు దాదాపు చికిత్సే లేక మరణం కోసం నిరీక్షిస్తున్న హెచ్.ఐ.వి. రోగులకు భవిష్యత్తుపైన విశ్వాసం కలిగించే ఉద్దేశ్యంతో ఈ చక్కటి నవల రచించారు.

దురదృష్టవశాత్తు మన సమాజంలోని ఆర్థికంగా, సామాజికంగా బలహీన వర్గాల వారు పెద్ద ఎత్తున ఈ దారుణమైన రోగానికి బలి అయిపోతున్నారు. నివారణా మార్గాలు తెలియక, తెలిసినా పాటించలేక దుర్భర పరిస్థితుల్లో మగ్గుతున్న వారిలో అత్యధికులైన "ఎయిడ్స్" రోగగ్రస్తులు పేదలే. అందునా అమాయకత్వంతో అణచబడిన పరిస్థితుల్లో ఉన్న మహిళలే ఈ వ్యాధికి అత్యధికంగా బలైపోతున్నారు.

వాద్య కళాకారుల కుటుంబంలో పుట్టిన కుంతల వరాళి అనే యువతి జీవితంలో సంభవించిన వివిధ పరిణామాలను, చివరగా మద్రాసు సినీ ప్రపంచంలోని మోసగాళ్లచే మోసగించబడి బ్రతుకు తెరువు కొరకు తన శరీరాన్ని అమ్ముకొని తుదకు "ఎయిడ్స్" బారిన పడుతుంది. ఈ మధ్య ఆమె ఆరోగ్యంగా ఉన్నప్పుడు భజన బృంద నిర్వాహకుల ప్రేమకు కూడా ఆకర్షితురాలవుతుంది. వారి కుటుంబాలకు సహాయకురాలిగా తన రోజులను వెళ్లమార్చుతుంది. కుంతల జీవిత గాథ అంతా మనల్ని బందరుకు, మద్రాసుకు, తిరుపతికి చేయి పట్టి తీసుకెళ్లి అక్కడి విశేషాలను తెలియజేస్తుంది. ఇంతవరకు ఈ "తీయని వేదన" పాఠకుల్ని ఒక చక్కటి నవలా రూపంలో చకచకా చదివింపజేస్తూ అలరిస్తుంది.

నవల చివరి భాగం మొత్తం "ఎయిడ్స్" రోగులకు డాక్టర్ల కౌన్సిలింగ్ తోను, సూచనలతోను అపరిమితంగా నిండి ఉంది. ఆ రోగం బారిన పడకుండా నివారణే మార్గమని అందరూ చెబుతుంటారు గాని మన శరీరంలో ఆ రోగక్రిములు ప్రవేశించిన దశలో పరిశోధనలో "హెచ్.ఐ.వి" పాజిటివ్ తోనే అంతా ఐపోయిందని భయపడాల్సిన అవసరం లేదనీ, నిరంతరం చికిత్స చేయించుకొంటూ జీవన విధానంలో మార్పులు చేసుకొంటే దీర్ఘకాలం ఆనందంగా జీవించవచ్చుననే ఆత్మస్థైర్యాన్ని ఈ నవల అందిస్తుంది. ఈ పుస్తక విజయం ఇందులోనే ఉంది.

ఈ నవలా రచయిత ఇంజనీరు అయినప్పటికీ తాత్వికతకు ప్రాధాన్యమిచ్చేవారు కనుక మధ్య మధ్య సుదీర్ఘమైన తాత్విక చింతనలు వెదజల్లారు. ఒక్కోచోట అవి శృతిమించిన దాఖలాలు ఉన్నాయి. అలాగే విభిన్న దేశాలలో "ఎయిడ్స్" రోగచరిత్ర సామాన్య పాఠకులు అందుకోలేనంత విస్తృతంగా పేర్కొనబడింది. ఇందువల్ల పునారావృత్తులు కూడా ఎక్కువగానే ఉన్నాయి. అయితే సాహిత్యపరంగాను సాంకేతిక పరంగానూ "ఈ తీయని వేదన" నవల విజ్ఞులైన పాఠకుల ఆదరణకు తప్పక నోచుకుంటుంది. ఒక ఉన్నత సామాజిక ప్రయోజనాన్ని ఆశించి శ్రమకోర్చి కృషి చేసిన జె.యస్.రఘుపతిరావు ఎంతైనా అభినందనీయులు

- ఎ.జి. యతిరాజులు



అమ్మణ్ణి
25 పిల్లల పాటలు- బొమ్మలతో
చింతా దీక్షితులు
వెల : 25/-, పేజీలు : 58,
ప్రతులకు :
విశాలాంధ్ర బుక్ హౌస్,
అబిడ్స్, సుల్తాన్ బజార్
మరియు అన్ని బ్రాంచీల్లో

పట్టుదలతో
సాధించలేనిదేముంది?
నీలంరాజు లక్ష్మీప్రసాద్
వెల : 15/-, పేజీలు : 38,
ప్రతులకు :
విశాలాంధ్ర బుక్ హౌస్,
అబిడ్స్, సుల్తాన్ బజార్
మరియు అన్ని బ్రాంచీల్లో





బరువులెత్తగలవా...

ఈమధ్య తూర్పు చైనాలో ఓ పోటీ జరిగింది. ఆడా మగా, ముసలీ ముతక అన్న తేడా లేకుండా ఎగబడి ఈ పోటీలో పాల్గొన్నారు. ఇలాగన్నామని ఇదేదో సింపుల్‌గా ఉంటుందనుకోకండి. 35 కిలోల బరువుండే రెండు ఇనుప రాళ్లను రెండు చేతుల్తో అవలీలగా పైకి ఎగరేసి పట్టుకోవాలి. అన్ని రౌండ్లలో గెలిచిన వారే విజేత. ఇంతకీ ఎవరా విన్నర్ మహానుభావుడు అనుకుంటున్నారా! ఫొటోల్లో కనిపించే కళ్లజోడువాలా నే.

ఇదోటైపు...



మామూలుగా తలపని చేయడానికి కత్తెర వుంటే చాలు. కానీ ఈ పెద్దమనిషి చూడండి నిప్పుతోనే నీట్‌గా చేసేస్తున్నాడు. ఇదో టైపు కటింగ్ మరి.

అయితే ఎక్కడ... ఎవరు... అనిమాత్రం అడక్కండి. ఓ నెట్ నేస్తం తను చూసిన ఈ వెరైటీ ఫొటోలను మాకు పంపాడు. మేం మీముందుంచాం. దట్సాల్.



పులి - నక్క

- రంగనాథ రామచంద్రరావు

అది నల్లమల అడవి. ఆ దట్టమైన అడవి మధ్యలో ఒక గుహలో ఓ పులి నివసిస్తూ ఉండేది. అది ప్రతీ రోజు అడవిలోకి వెళ్ళి ఏదో ఒక జంతువును తిని ఆకలి తీర్చుకునేది. చీకటిపడే వేళకు తన గుహను చేరుకుని గుర్రుపెట్టి నిద్రపోయేది. మళ్లీ తెల్లవారగానే ఆకలి తీర్చుకోవటానికి వేటకు బయలుదేరేది.

ఒక రోజు పులి ఆహారం కోసం జంతువును వెదుకుతూ అడివిలోకి వెళ్ళింది. అదే సమయంలో తలదాచుకోవటానికి ఏదైనా గూడు దొరుకుతుందేమోనని భార్యా పిల్లలతో అటుగా వచ్చిన ఓ నక్క ఆ గుహను ఆక్రమించుకుంది.

చీకటి పడింది. అడవి అంతా నిశ్శబ్దంగా వుంది. కీచురాళ్ళ రొదలు తప్ప ఏమీ వినిపించటం లేదు. అప్పటిదాకా చిన్న చిన్న జంతువులను వేటాడి పొట్ట నింపుకున్న పులి తన గుహ వైపు బయలుదేరింది.

పులి రాకను గమనించిన నక్క ఉలిక్కిపడింది. ముందు వెనక ఆలోచించకుండా, పరిసరాలు గమనించకుండా తను భార్యాబిడ్డలతో పాటు పులి గుహలో చిక్కుకుపోయినట్టు గ్రహించింది. అయితే ధైర్యాన్ని కోల్పోకుండా ఏం చేయాలా అని గబగబా ఆలోచించి పులి వినేటట్టు తన భార్యను ఉద్దేశించి

"ఏమేవ్! ఈ రోజు మనం పండుగ చేసుకోవచ్చు. పాపం ! పిల్లలు చాలా రోజుల నుంచి 'పులి మాంసం తీసుకురా నాన్నా! పులి మాంసం తీసుకురా' అని పోరు పెడుతున్నారు. ఇన్నాళ్ళకు వారి కోరిక తీరబోతోంది. ఓ పులి ఈ దారినే వస్తోంది. దాని మీద పడి చంపేయండి. ఈ రోజు విందు చేసుకుందాం. ఊ ! పదండి" అంది.

ఆ మాటలకు పులికి పైప్రాణాలు పైనే పోయాయి. భయంతో అది వొణికిపోయింది. తనకంటే భయంకరమైన ఓ జంతువు తన గుహను ఆక్రమించుకుందనుకుంది. ఇక తను అక్కడ ఉంటే తన ప్రాణాలకే ముప్ప అనుకుంది. బతికుంటే బలుసాకు తిని బతకొచ్చు అనుకుంటూ అక్కడి నుంచి పరుగు తీసింది.

అలా పరుగుతీస్తూ పరుగుతీస్తూ బాగా అలిసిపోయి ఓ చెట్టు కింద ఆగింది. అదే దారిన వస్తున్న ఓ తోడేలు ఆయాసంతో ఒగరుస్తున్న పులిని చూసి "అయ్యా పులి రాజావారు! ఎందుకలా పరుగెత్తుకొచ్చారు. ఏమైంది? ఎందుకలా వొణికిపోతున్నారు? ఏదైనా దయ్యాన్ని చూశారా?" అని అడిగింది.

"ఒరే చిన్నోడా! నాకంటే బలమైన భయంకర జంతువు నా గుహను ఆక్రమించుకుంది. నా మాంసం తినాలని దాని పిల్లలకు చాలా కోరికగా ఉందట. దాంతో దాని కుటుంబమంతా నా మీదకు దాడికి బయలుదేరబోతుంటే నేను తప్పించుకుని వచ్చాను" అంది పులి దీనంగా.

ఆ మాటలకు తోడేలు పగలబడి నవ్వింది.

పులి దానివైపు అయోమయంగా చూసింది. ..డేలు నవ్వాపి- "పులి బావా! నువ్వు ఒట్టి అమాయకుడివి. నీ గుహను ఓ నక్క దాని భార్యాబిడ్డలు ఆక్రమించుకున్నాయి. అంతేకాని మరెలాంటి భయంకరమైన జంతువు అక్కడ లేదు. వెళ్ళి చూడు" అంది.

"నీవు నిజమే చెబుతున్నావా?" పులి అనుమానంగా అడిగింది.

"పులిబావా ! నీవు నన్నే అనుమానిస్తున్నావా? పద, నీ వెంట నేను కూడా వస్తాను". అంది. పులి సంకోచిస్తూ నిలబడింది. "ఏం పులిబావా! భయపడుతున్నావా? సరే నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డువేస్తాను. నా తోకను కలిపి ముడి వేస్తాను. ఇద్దరం కలిసి వెళదాంసరేనా?" అంటూ తోకల్ని ముడివేసింది.

ఈ తరువాత రెండు జంతువులు పులి గుహ వైపు కదిలాయి. పులి, తోడేలు గుహ వైపు రావటం గమనించిన ఆడనక్క "ఓ తోడేలు మామా ! నాతో నీవు ఏం చెప్పావు? పది పులుల్ని పట్టుకొస్తానని ఒక్క పులినే పట్టుకొచ్చావే? మిగతా పులులెక్కడా?" అని అరిచింది.

ఆ మాటలకు వాటి గుండెలు గుభేల్ మన్నాయి. ప్రాణ భయంతో అవి పరుగుతీయబోయాయి. అయితే తోకలు ముడివేసి ఉండటంవల్ల వ్యతిరేక దిశలో పరుగుతీయటం వల్ల అంతా రభస రభసగా మారింది. బలమైన పులి తోడేలును ఈడ్చుకుంటూ పరుగుతీసింది. అడవి దారిలోని రాళ్ళు, ముళ్ళ పొదల కారణంగా గాయపడిన తోడేలు ప్రాణాలు పోగొట్టుకుంది. అలా పరుగెత్తుతూ పరుగెత్తుతూ పులి ఓ చెట్టుకిందికి వచ్చి ఆగింది.

చెట్టు మీద కూర్చున్న కోతి -"ఏం పులిరాజా ! ఎందుకలా పరిగెత్తుకొస్తున్నావు? ఏంటీ కథ?" అని అడిగింది.

"ఏం చేయాలి కోతిబావా! నా గుహను ఓ భయంకరమైన జంతువు ఆక్రమించుకుంది. నాకేం చేయాలో తోచటం లేదు" అంది పులి దీనంగా.

ఆ మాటలకు కోతి కిచకిచమని నవ్వింది. పులి కోపంగా కోతి వైపు చూసింది. కోతి నవ్వు ఆపుకుని

"నువ్వు ఒట్టి అమాయకుడివి పులిరాజా! నీకంటే భయంకరమైన జంతువు ఈ అడివిలో ఉందా? నీ గుహలో నక్క దాని కుటుంబం నివాసం ఏర్పరుచుకున్నాయి. నేను నా కళ్ళతో ఆ నక్క కుటుంబాన్ని చూశాను. పద వెళదాం. వాటిని బయటికి తరిమి నీ గుహను స్వాధీనం చేసుకుందాం" అంది.

కోతి పులి వీపు మీదికి ఎక్కి కూర్చుంది. పులి తన గుహ వైపు కదిలింది. అవి రెండూ కలిసి రావటం గమనించిన ఆడ నక్క "కొంపలు ముంచే కోతీ! ఈ రోజు తెల్లవారేసరికి పులిని తెచ్చి నాకు అప్పగిస్తానన్నావు. ఇప్పుడా వచ్చేది? నీ రాక కోసం ఎంత సేపటి నుంచి ఎదురు చూస్తున్నామో తెలుసా?" అంది.

ఆ మాటలు వినగానే పులి గజగజా వొణికి పోయింది. ఆ తరువాత ఒక్కసారిగా ఎగిరి ముందుకు దూకి అడవిలోకి పరుగుతీసింది. పులి ఎగరటంతో దాని వీపు మీద కూర్చున్న కోతి గాలిలోకి బంతిలా ఎగిరి ఓ బండరాతికి కొట్టుకుని ప్రాణాలు వదిలింది. పులి ఇక తన గుహ మీద ఆశ వదులుకొని మరొక ఆవాసం చూసుకుంది.

ఆడ నక్కసమయస్ఫూర్తితో తమకంటే ఎంతో బలమైన పులిని ఎదుర్కోవటమే కాకుండా, తన కుటుంబాన్ని కూడా కాపాడుకుంది. భర్తతోనూ, పిల్లలతోను పులి గుహనే శాశ్వత నివాసంగా మార్చుకుని సంతోషంగా జీవించింది.

❖ ❖ ❖